


VARTHAA SAKSHAMU
RNI.Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR

హైదరాబాద్, విజయవాడ | సంపుటి : 01 | సంచిక : 59 | బుధవారం 29 జూలై 2026 | పేజీలు : 8 | వెల : 2/-

## సైబర్ మోసాలకు పాల్పడితే మరణశిక్ష..
# మయన్మార్‌లో కొత్త చట్టం

- ఆన్‌లైన్ మోసాల పై మయన్మార్‌లో కఠిన చట్టం
- బలవంతపు స్కామ్‌లకు పాల్పడితే ఇక పై మరణశిక్ష
- స్కామ్ సెంటర్ల నిర్వాహకులకు యావజ్జీవ కారాగార శిక్ష
- యాంటీ ఆన్‌లైన్ స్కామ్ బిల్లుకు మయన్మార్ పార్లమెంట్ ఆమోదం


2

## సజావుగా చర్చలు.. విఫలమైతే
# ఇరాన్ పై మళ్లీ దాడులే: ట్రంప్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్ విషయంలో కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌తో చర్చలు సజావుగా సాగుతున్నాయని, ఒక ఒప్పందం కుదిరేందుకు మంచి అవకాశం ఉందని తెలిపారు. అయితే, ఈ చర్చలు విఫలమైతే మాత్రం రెండు రోజుల క్రితం ఆపిన సైనిక దాడులను పునఃప్రారంభిస్తామని గట్టిగా హెచ్చరించారు.


2

# ఓ దళితుడా కూటమి పాలనలో...
# నీ స్థానం ఎక్కడ..!

- కూటమి ప్రభుత్వంలో దళితులకు న్యాయం జరిగేన
- కాకరవాడకు ఇచ్చిన హామీని అధిష్టానం నెరవేరుస్తుందా
- రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటారా
- రాష్ట్రంలో జరిగే రెండు ఎమ్మెల్సీ స్థానాలలో దళితులకు అవకాశం దక్కేనా

2





## పోలీసుల అదుపులో ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి


2

సహచర ట్రైనీ ఐపీఎస్ పై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు కేసు నమోదు నేపథ్యంలో ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం ఉమ్మడి నల్గొండ జిల్లాలోని మిర్యాలగూడ వద్ద అతడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అతడిని హైదరాబాద్ తరలించారు. శంకరపల్లిలోని నేషనల్ పోలీస్ అకాడమీలో మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారి పై లైంగిక వేధింపుల కేసులో ఉదయ్ కృష్ణారెడ్డిపై అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయింది.

## జైల్లో ఉన్న సీదిరి అప్పలరాజును పరామర్శించనున్న జగన్

వైసీపీ అధినేత జగన్ శ్రీకాకుళం జిల్లా పర్యటనకు సిద్ధమయ్యారు. ఈ నెల 30 (గురువారం)న ఆయన శ్రీకాకుళం వెళ్లనున్నారు. ఈ పర్యటనలో భాగంగా అంపోలు జైల్లో రిమాండ్‌లో ఉన్న మాజీ మంత్రి, పార్టీ సీనియర్ నాయకుడు సీదిరి అప్పలరాజును జగన్ ములాఖత్ ద్వారా పరామర్శించనున్నారు. ఇటీవల జరిగిన ఒక బైక్ ప్రమాదంలో (అప్పలరాజు కుమారుడి కేసు) ఒక వ్యక్తి మృతి చెందిన ఘటనకు సంబంధించి, దర్యాప్తును పక్కదోవ పట్టించారనే ఆరోపణతో అప్పలరాజును పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే.


2

## హైడ్రా పై బీజేపీ, బీఆర్ఎస్ కుట్రలు చేస్తున్నాయి

హైడ్రా పై బీజేపీ, బీఆర్ఎస్ కుట్రలు చేస్తున్నాయని, హైడ్రా పై ప్రజల్లో విశ్వాసం పెరుగుతోందని, రాజకీయ ప్రయోజనాల కోసమే వ్యతిరేక ప్రచారం జరుగుతోందని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ప్రజల ప్రయోజనాల కోసం పనిచేస్తున్న సంస్థ హైడ్రా అని, అందుకే సాధారణ ప్రజలు దీనిని స్వాగతిస్తున్నారని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. హైడ్రాకు మద్దతుగా ప్రజలు స్వచ్ఛందంగా ర్యాలీలు నిర్వహించడం ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు.


2

VARTHAA SAKSHAMU
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



# ఓ దళితుడా కూటమి పాలనలో... నీ స్థానం ఎక్కడ..!

కర్నూలు జులై 28 వార్త సాక్ష్యం

ఎన్నికల సమయంలో దళితులకు ఇచ్చిన హామీలను కూటమి పాలనలో అవకాశం కల్పిస్తామని చెప్పిన పార్టీ పెద్దల మాటలు ఏమయ్యాయి అంటూ నంద్యాల జిల్లాలో.. టిడిపి పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ఓ.. దళితుడా.. నీ స్థానం ఎక్కడ.. అంటూ దళిత సంఘాల నేతలు, దళిత ప్రజలు ఎదురుచూస్తున్నారు రాష్ట్రవ్యాప్తంగా కూటమి పాలనలో పార్టీ కోసం పనిచేసిన సీనియర్ నాయకులకు కార్యకర్తలకు రాష్ట్రవ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నామినేటెడ్ పదవుల విషయంలో దళితులకు సమూచిత స్థానం కల్పించకుండా, (ఓసి) అగ్రవర్ణాలకు, (బిసి ) బీసీలకు అధిక ప్రాధాన్యతనిస్తూ, డాక్టర్ కాకరవాడ చిన్న వెంకటస్వామికి మొండి చేయి చూపిస్తుందని దళితులు ఆవేదనవ్యక్తం చేశారు కనీసం రాష్ట్రవ్యాప్తంగా త్వరలో జరుగుతున్న రెండు ఎమ్మెల్సీ స్థానాల్లో ఏమైనా నంద్యాల జిల్లా దళితులకు న్యాయం జరిగేనా అని ఎదురుచూసే పరిస్థితి నెలకొంది. నంద్యాల జిల్లాలో మొత్తం 17,81,777 జనాభా ఉండగా ఇందులో దళిత జనాభా దాదాపు 4 లక్షలు (3,81,609) గా ఉన్నదని. ఇది జిల్లా మొత్తంలో దాదాపు 22% ఉన్నది. ఐతే ఎమ్మెల్సీ కానీ, నామినేటెడ్ ఒక్క చైర్మన్ గాని, డైరెక్టర్ మెంబర్లు గా పదవుల్లో వీరికి ఏమాత్రం ప్రాధాన్యత ఇవ్వకపోవడం శోచనీయ అంశమని. చెప్పవచ్చు కూటమిపాలనలో పార్టీ కోసం పనిచేసిన దళితులకు స్థానం ఎక్కడా,? అర్థం చేసుకోవాలని దళిత సంఘాల నేతలు వాపోతున్నారు.నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీని ప్రారంభించిన నాటి నుండి దళిత సామాజిక ఉద్యమాలు ఎన్ని జరిగినా, దళితులలో ఎంత చైతన్యం కలిగినా, చివరకు రాజకీయ పార్టీలు వారి పట్ల చిన్నచూపు చూస్తూ ఉన్నాయని అనడంలో ఏలాంటి సందేహం లేదు అని వాళ్ళు చెప్పుకొస్తున్నారు. ఇదే తెలుగుదేశం పార్టీకి అధికారం లేనప్పుడు జిల్లాలో వైఎస్ఆర్సిపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా తమ వానిని వినిపించింది దళితులేనని, పార్టీకి అండగా నిలిచింది, జెండా భుజాన వేసుకొని పోరాటం చేసింది, వైసీపీ నాయకులను ఎదిరించింది, ఇదే జిల్లాలో చంద్రబాబు నాయుడుని అరెస్టు చేస్తే నిరసనలు తెలిపింది దళితులే, ఇప్పుడు వారికి ఎమ్మెల్సీ గానీ, నామినేటెడ్ పదవుల్లో గానీ, జిల్లా అధ్యక్షుడి నియామకంలో గానీ తగిన సముచిత స్తానం కల్పించడంలో ఎందుకు విఫలమవుతున్నారని. జిల్లా అధ్యక్షపదవి 22% శాతం ఉన్న దళితులకు ఇవ్వాలని నిరసనలు తెలిపినా, పార్టీ పెద్దలదృస్టికి తీసుకెళ్లినా, దళితులకు ఎందుకు ఇవ్వరని,దళితులు కేవలం జెండాలు మొయ్యడానికేనా.. ఈ విషయంపై దళిత మేధావులు, దళితజాతి నాయకులు మొత్తం పునరాలోచన చేయవలసిన అవసరం ఉందని, దీనిపై సుదీర్ఘమైన చర్చలు కొనసాగుతున్నాయి. ఎన్ని ప్రభుత్వాలు మారినా దళితుల తలరాతలు మారవు అని. ఆ తలరాతలు మార్చుకునేందుకు అంబేద్కర్ మార్గమే సరైన దారి అని , పోరాటం ద్వారానే మన హక్కులను మనము రక్షించుకోగలుగుతామని, దళిత జాతిని మేల్కొల్పే పనిలో నిమగ్నమై ముందుకు సాగుతామని. ఇప్పటికే తెలుగుదేశం పార్టీ ప్రకటించినటు వంటి నామినేటెడ్ పదవులలో నంద్యాల జిల్లా లో కూటమి ప్రభుత్వంలో (ఓసీ) ఓసి సామాజిక వర్గం నుంచి ఒక మంత్రి, ఒక చైర్మన్, నాలుగు డైరెక్టర్ మెంబర్లు మొత్తం ఐదు నామినేటెడ్ పదవులు అగ్రవర్ణ సామాజిక వర్గానికి ఇవ్వడం జరిగింది. (బిసి) బీసీ సామాజిక వర్గానికి రెండు చైర్మన్లు, పదకొండు డైరెక్టర్ మెంబర్లు నామినేటెడ్ పదవులు, జిల్లా అధ్యక్షుడు పదవి ఇవ్వడం జరిగింది. మైనారిటీ సామాజిక వర్గానికి ఒక చైర్మన్ నాలగు డైరెక్టర్ మెంబర్లు నామినేటెడ్ పదవులు ఇవ్వడం జరిగింది. ఇదిలా ఉంటే దాదాపు 22% శాతం జనాభా ఉన్న దళితులకు మాత్రం ఒక్క పదవి కూడా ఇవ్వకపోవడం దురదృష్టకరం. దీనివల్ల దళిత సామాజిక వర్గం మొత్తం నిరాశా, నిస్పృహలతో ఉన్నారన్నది అందరికీ తెలిసిన విషయమే. రేపు జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో వారి యొక్క ఓట్లు కూడా అవసరం లేదన్నట్టుగా భావిస్తున్నారని, కొందరు దళిత సంఘాల నాయకులు చర్చించుకుంటూ ఉంటే, అధికార పార్టీ దళితుల పట్ల చూపుతున్నటువంటి ఆదరణ, వారికి ఇచ్చేటువంటి ప్రాధాన్యత గురించి ఒకసారి ఆలోచిస్తే బాగుంటుందని కూటమి పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నాయి. దళితులు ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడి ఉండడమే కాకుండా, నేటికీ అంటరానితనం తో అనేక సమస్యలను ఎదుర్కొంటూ ఉన్నారు. ఎన్నికల ముందు తెలుగుదేశం పార్టీ మరియు ఉమ్మడి కూటమి పార్టీలు గత వైసీపీ ప్రభుత్వం దళితులకు చేసిన అన్యాయాన్ని ఎత్తిచూపుతూ వారి ఓట్ల కోసం మాత్రమే పని చేసినట్లు కనిపిస్తూ ఉంది. నేడు గద్దెనెక్కిన తర్వాత దళితుల సంక్షేమం గాని, దళితులకు ఇచ్చేటువంటి ప్రాధాన్యత గాని, సామాజిక న్యాయం లో గాని, వారికి రద్దు అయిన 27 సంక్షేమ పథకాలు అమలు చేయడంలో గాని, అన్యాయమే జరుగుతుందని దళిత వర్గాలు మేధావులు భావిస్తూ ఉన్నారు. కావున తెలుగుదేశం పార్టీ అధినాయకత్వం దళితుల సామాజిక న్యాయం గురించి ఆలోచిస్తారని, వారికి తగిన ప్రాధాన్యతను కల్పిస్తారని, ఎదురు చూస్తూ ఉన్నారన్నది. ఈ దగాపడ్డ దళితులకు తగిన ప్రాతినిధ్యం ప్రాధాన్యత ఇస్తారని నమ్మకంతో తెలుగుదేశం పార్టీలో పని చేస్తున్నటువంటి మరియు కూటమి ప్రభుత్వంలో ఉన్నటువంటి దళితులు ఆది నాయకత్వం పట్ల నమ్మకంతో, విశ్వాసంతో ముందుకు సాగుతూ ఉన్నారు... ఒక మాటలో చెప్పాలంటే జిల్లాలో ని నియోజకవర్గం లో వైసిపి నేతలను ఎదిరించి నిలబడ్డ డాక్టర్ కాకరవాడ చిన్న వెంకటస్వామి, తన ప్రొఫెసర్ ఉద్యోగానికి రాజీనామా చేసి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నా రాజేంద్ర బాబు నాయుడు ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ కోసం అహర్నిశలు కృషి చేస్తూ ఉన్నారు.. చంద్రబాబు నాయుడు గారు నారా లోకేష్ హామీ ఇచ్చి చివరి నిమిషంలో ఎమ్మెల్యే టికెట్ వేరే వాళ్లకు కేటాయించి అన్యాయం చేసిన, తెలుగుదేశం పార్టీ కోసం, తెలుగుదేశం అభ్యర్థుల గెలుపు కోసం, కృషి చేసినటువంటి డాక్టర్ కాకరవాడ చిన్న వెంకటస్వామికి ఆనాడు నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు ఆయనకు ఎమ్మెల్సీ గాని, నామినేటెడ్ చైర్మన్ పదవుల్లో గాని, సముచిత స్నానం కల్పిస్తారా..?..లేదా అని..?ఎదురుచూస్తూన్న ... పార్టీ కొరకు ఇతనికి ఇచ్చిన హామీని అయినా ఆది నాయకత్వం నిలబెట్టుకుంటుందా. లేదో.. వేచి చూడవలసిన అవసరం ఎంతైనా ఉంది. గత ప్రభుత్వాల లాగానే దళితులకు మొండి చేయి చూపిస్తారా అనే విషయం వేచి చూడాల్సిందే ఏది ఏమైనా దళితులకు తగిన ప్రాధాన్యత కల్పించి, సామాజికపరంగా వారికి కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తూ ఉన్నామని దళితులు దళిత సంఘాల నాయకులు కచ్చితంగా కూటమి ప్రభుత్వంలో దళితులకు న్యాయం జరుగుతుందని ఎదురు చూడడం జరుగుతుంది ఈ విషయం పైన జిల్లా వ్యాప్తంగా ఉద్యమం చేయడానికి కూడా వెనకాడబోమని దళితులంతా ఏకతాటి పైన నడుస్తామని తెలియజేస్తున్నాం

# జైల్లో ఉన్న సీదిరి అప్పలరాజును పరామర్శించనున్న జగన్

అయితే, ఈ కేసును కూటమి ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే కుట్రపూరితంగా నమోదు చేసిందని వైసీపీ ఖండిస్తోంది. ఒక సాధారణ రోడ్డు ప్రమాదాన్ని హత్య కేసుగా మార్చి, అప్పలరాజును ఏ3గా చేర్చడం వెనుక పెద్ద కుట్ర ఉందని పార్టీ నేతలు ఆరోపిస్తున్నారు. ఈ పర్యటన ద్వారా సీదిరి అప్పలరాజుకు, ఆయన కుటుంబ సభ్యులకు పార్టీ పూర్తి అండగా ఉంటుందనే భరోసానివ్వడమే కాకుండా, పార్టీ కేడర్‌లో ధైర్యాన్ని నింపడమే జగన్ పర్యటన ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. సీదిరి అప్పలరాజును పరామర్శించిన అనంతరం జగన్ ఆయన కుటుంబ సభ్యులతో కూడా భేటీ కానున్నారు.

# విద్యార్థుల ఆందోళనల పై సుప్రీం కీలక ఆదేశాలు

నీట్-యూజీ 2026 ప్రశ్నపత్రం లీక్ ఆరోపణల పై దేశవ్యాప్తంగా జరిగిన విద్యార్థుల ఆందోళనల సందర్భంగా పోలీసుల బలప్రయోగం, పోలీసుల పై జరిగిన దాడుల పై స్వతంత్ర దర్యాప్తు అవసరమని సుప్రీంకోర్టు అభిప్రాయ పడింది. ఈ వ్యవహారంపై రిటైర్డ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపింది. అలాగే నేర చరిత్ర లేని విద్యార్థి నిరసనకారులపై తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోవద్దని ఆదేశించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది. పిటిషనర్ల ఆరోపణలు ప్రాథమికంగా స్వతంత్ర, నిష్పాక్షిక దర్యాప్తు అవసరాన్ని సూచిస్తున్నాయని పేర్కొంది. ఈ అంశంపై కేంద్రంతో పాటు అసోం, బీహార్, కేరళ, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. ఆందోళనల సందర్భంగా అదుపులోకి తీసుకున్న మైనర్లను వెంటనే విడుదల చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. కేవలం నిరసనల్లో పాల్గొన్నారనే కారణంతో అరెస్టు చేసిన లేదా అదుపులో ఉంచిన విద్యార్థులకు నేర చరిత్ర లేకపోతే వారిని కూడా విడుదల చేయాలని స్పష్టం చేసింది. అయితే క్రిమినల్ నేపథ్యం ఉన్న వారికి ఈ రక్షణ వర్తించదని పేర్కొంది. ఆందోళనలకు సంబంధించిన సీసీటీవీ దృశ్యాలు, డ్రోన్ వీడియోలు, బాడీ కెమెరా రికార్డింగులు, వైర్‌లెస్ కమ్యూనికేషన్ వివరాలు, పీసీఆర్ లాగ్‌లు సహా అన్ని ఎలక్ట్రానిక్ ఆధారాలను భద్రపరచాలని ధర్మాసనం ఆదేశించింది. విద్యార్థుల వ్యక్తిగత సమాచారం, డిజిటల్ డేటాను కూడా భద్రపరచాలని, అయితే ప్రస్తుతానికి వాటిని బహిర్గతం చేయవద్దని స్పష్టం చేసింది. పోలీసు సిబ్బందిపై జరిగిన దాడులపైనా సమగ్ర దర్యాప్తు అవసరమని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా పేర్కొన్నారు. సుమారు 250 మంది పోలీసులకు కూడా గాయాలయ్యాయని తెలిపారు.

# హైడ్రా పై బీజేపీ, బీఆర్ఎస్ కుట్రలు చేస్తున్నాయి

ప్రజల ప్రయోజనాల కోసం పనిచేస్తున్న సంస్థ హైడ్రా అని, అందుకే సాధారణ ప్రజలు దీనిని స్వాగతిస్తున్నారని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. హైడ్రాకు మద్దతుగా ప్రజలు స్వచ్ఛందంగా ర్యాలీలు నిర్వహించడం ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రభుత్వ చర్యలకు ప్రజల నుంచి వస్తున్న మద్దతును చూసి కొందరు రాజకీయ పార్టీలు అసహనం వ్యక్తం చేస్తున్నాయని విమర్శించారు. హైడ్రాను అడ్డుకునేందుకు రాజకీయ ప్రయోజనాల కోసమే కొందరు కోర్టుల్లో పిటిషన్లు దాఖలు చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్ కలిసి హైడ్రాపై కుట్రలు చేస్తున్నాయన్నారు. కోర్టు వ్యవస్థపై ప్రభుత్వానికి పూర్తి గౌరవం ఉందని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. హైడ్రాకు సంబంధించిన పూర్తి తీర్పు ఇంకా వెలువడలేదని, తుది తీర్పు వచ్చిన తర్వాత ప్రభుత్వం చట్టపరంగా ముందుకు సాగుతుందని తెలిపారు. ప్రభుత్వం తరఫున చెప్పాల్సిన అన్ని అంశాలనూ కోర్టు ముందే వివరిస్తామని, న్యాయ ప్రక్రియను పూర్తిగా గౌరవిస్తామని చెప్పారు. అయితే కోర్టు తీర్పు పూర్తిగా రాకముందే కొన్ని రాజకీయ పార్టీలు, ముఖ్యంగా బీఆర్ఎస్ సోషల్ మీడియా వేదికల ద్వారా తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. వాస్తవాలు బయటకు వచ్చే వరకూ ప్రజలు పుకార్లను నమ్మవద్దని, అధికారిక సమాచారం ఆధారంగానే స్పందించాలని మంత్రి శ్రీధర్ బాబు సూచించారు.

**విద్యార్థుల నిరసన కేంద్రానికి చెంపపెట్టు..**

నీట్ పరీక్ష అనేది కోట్లాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న అంశమని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. విద్యార్థుల నిరసనలను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం వారి ఆకాంక్షలకు చెంపపెట్టులాంటిదని విమర్శించారు. ప్రధాని నివాసం ముందు రాహుల్ గాంధీ చేపట్టిన నిరసనతో ఈ ఉద్యమం మరింత ఉధృతమైందని చెప్పారు. కాంగ్రెస్ చేపట్టిన ఉద్యమాల వల్లే దేశవ్యాప్తంగా నిరసనలు విస్తరించాయని పేర్కొన్నారు. ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ నాయకుల్లో 90 శాతం మంది జెన్-జీ యువతేనని శ్రీధర్‌బాబు తెలిపారు. యువత ఆలోచనలకు అనుగుణంగా పనిచేసే నాయకత్వం సీఎం రేవంత్ రెడ్డిదని కొనియాడారు. జెన్-జీతో పోటీ పడే ఆలోచనా విధానం ఆయనకు ఉందన్నారు. రాష్ట్రంలో ఎవరు మంత్రులు కావాలన్నది కాంగ్రెస్ అధిష్ఠానం (ఏఐసీసీ) నిర్ణయిస్తుందని స్పష్టం చేశారు.

# సైబర్ మోసాలకు పాల్పడితే మరణశిక్ష.. మయన్మార్‌లో కొత్త చట్టం

ఆన్‌లైన్ మోసాలను (సైబర్ స్కామ్స్) అరికట్టే దిశగా మయన్మార్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రజలను బలవంతంగా హింసించి, ఆన్‌లైన్ మోసాలకు పాల్పడేలా చేస్తున్న నేరగాళ్లకు మరణశిక్ష విధించేలా రూపొందించిన కొత్త చట్టానికి ఆమోదం తెలిపింది. రాజధాని నైప్యిడాలో జరిగిన పార్లమెంట్ ఉభయ సభల సంయుక్త సమావేశంలో 'యాంటీ-ఆన్‌లైన్ స్కామ్ బిల్లు'కు ఆమోదం లభించినట్లు స్పీకర్ ప్రకటించారు. ఈ నూతన చట్టం ప్రకారం, ఉద్యోగాల పేరుతో ప్రజలను కిడ్నాప్ చేసి, వేధింపులకు గురిచేస్తూ బలవంతంగా ఆన్‌లైన్ నేరాలకు పాల్పడేలా చేసే వారికి 10 ఏళ్ల నుంచి యావజ్జీవ కారాగార శిక్ష విధించే అవకాశం ఉంది. ఒకవేళ ఈ క్రమంలో బాధితులు ఎవరైనా మరణిస్తే, బాధ్యులైన నిందితులకు మరణశిక్ష విధించేందుకు ఈ చట్టం వీలు కల్పిస్తుంది. వీటితో పాటు స్కామ్ సెంటర్ల నిర్వాహకులకు, డిజిటల్ లేదా క్రిప్టోకరెన్సీ మోసాలకు పాల్పడే వారికి గరిష్ఠంగా యావజ్జీవ కారాగార శిక్ష పడేలా కఠిన నిబంధనలను పొందుపరిచారు. మయన్మార్‌లో నెలకొన్న అంతర్గత ఘర్షణలను ఆసరాగా చేసుకుని సైబర్ నేర కేంద్రాలు పుట్టగొడుగుల్లా విస్తరించాయి. ఆగ్నేయాసియా అంతటా విస్తరించిన ఈ నెట్‌వర్క్, పెట్టుబడులు, హనీ ట్రాప్ పేరుతో ప్రపంచవ్యాప్తంగా ఎంతోమందిని లక్ష్యంగా చేసుకుని మోసాలకు పాల్పడుతోంది. కొందరు స్వచ్ఛందంగానే ఈ ముఠాలలో చేరుతుండగా, మెజారిటీ విదేశీయులను ఆకర్షణీయమైన ఉద్యోగాల పేరుతో అక్రమంగా తరలించి, వారిని బందీలుగా మార్చి బలవంతంగా ఈ అరాచకాలకు ఒడిగడుతున్నారు. ఇటీవలి కాలంలో తెలుగు రాష్ట్రాల నుంచి కూడా ఎంతోమంది యువత ఉద్యోగాల వేటలో మయన్మార్ వెళ్లి, అక్కడ స్కామ్ కేంద్రాల్లో బందీలుగా చిక్కుకున్నట్లు అనేక ఉదంతాలు వెలుగులోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో, సైబర్ నేరగాళ్ల ఆటకట్టించేందుకు ప్రస్తుత సైనిక మద్దతుగల ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ కఠిన చట్టం అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది.

# సజావుగా చర్చలు.. విఫలమైతే ఇరాన్ పై మళ్లీ దాడులే: ట్రంప్

అయితే, ఈ చర్చలు విఫలమైతే మాత్రం రెండు రోజుల క్రితం ఆపిన సైనిక దాడులను పునఃప్రారంభిస్తామని గట్టిగా హెచ్చరించారు. ఈ వ్యాఖ్యలు చేసిన కొన్ని గంటలకే, మిచిగాన్‌లో జరిగిన ప్రచార ర్యాలీలో ట్రంప్ స్వరం మార్చారు. దౌత్య మార్గాలు ఫలించకపోతే ఇరాన్‌ను 'చితకబాదుతామని' తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అమెరికా-ఇరాన్ మధ్య ప్రత్యక్ష దాడులు తాత్కాలికంగా ఆగినా, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గలేదు. సోమవారం సౌదీ అరేబియా, జోర్డాన్, ఇరాక్‌లలోని పలు ప్రాంతాలపై డ్రోన్ దాడులు జరగడం ఆందోళన కలిగిస్తోంది. ఇరాన్ మద్దతున్న గ్రూపులే ఈ దాడులకు పాల్పడ్డాయని సౌదీ ఆరోపించింది. మరోవైపు, తాము చర్చల కోసం అభ్యర్థించామన్న వార్తలను ఇరాన్ ఖండించింది. మధ్యవర్తుల ద్వారా సందేశాలు మార్పిడి చేసుకుంటున్నామని, కానీ చర్చలు కోరడం తమ విధానం కాదని ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి స్పష్టం చేశారు. కాగా, ఇరాన్‌పై రెండు వారాల పాటు కొనసాగిన బాంబు దాడులను అమెరికా శనివారం నిలిపివేసింది. ప్రపంచ చమురు రవాణాలో కీలకమైన హర్మూజ్ జలసంధి పై నియంత్రణ విషయంలో ఇరు దేశాల మధ్య వివాదం కొనసాగుతోంది. ఈ జలసంధి గుండా నౌకల స్వేచ్ఛా రవాణాకు ఇరాన్ అడ్డు చెప్పరాదని అమెరికా అంటుండగా, ఆ అధికారం తమకే ఉందని టెహ్రాన్ వాదిస్తోంది. ఈ సైనిక హెచ్చరికల నడుమనే ఇరు దేశాల మధ్య పరోక్ష సంప్రదింపులు కొనసాగుతుండటం గమనార్హం.

# పోలీసుల అదుపులో ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి

శంకరపల్లిలోని నేషనల్ పోలీస్ అకాడమీలో మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారి పై లైంగిక వేధింపుల కేసులో ఉదయ్ కృష్ణారెడ్డి పై అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయింది. ఈ కేసు దర్యాప్తును ఉమెన్స్ సేఫ్టీ వింగ్‌కు నగర పోలీస్ కమిషనర్ సీపీ సజ్జనార్ బదిలీ చేశారు.

**స్పందించిన రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్**

ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డినీ చట్ట పరిధిలో ప్రొసీజర్ ప్రకారం విచారిస్తామని రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో డీసీపీ మాట్లాడుతూ. ఈ కేసులో నమోదైన సెక్షన్లు, ఆధారాలు బేస్ చేసుకొని అతడిని విచారిస్తామని చెప్పారు. అరెస్టు చేయాలా? లేక నోటీసులు ఇచ్చి విచారించాలా? అనేది అతడిపై నమోదైన సెక్షన్స్‌పై ఆధారపడి ఉంటుందని తెలిపారు. ఉదయ్ కృష్ణారెడ్డిపై కొన్ని అభియాగాలు ఉన్నాయని పేర్కొన్నారు. దీనిపై పూర్తి సమాచారాన్ని తర్వాత వెల్లడిస్తామని అన్నారు. ఈ కేసు దర్యాప్తు నిష్పక్షపాతంగా జరుగుతుందని డీసీపీ శ్రీనివాస్ వెల్లడించారు.

**ఆరోపణలు.. స్పందించిన ఉదయ్..**

అయితే ఉదయ్ కృష్ణారెడ్డి కనిపించడం లేదంటూ ఆరోపణలు వెల్లువెత్తాయి. దీని పై మంగళవారం అతడు స్పందించారు. తన పై వచ్చిన ఆరోపణలు అన్నీ అవాస్తవమేనని కొట్టిపారేశారు. తన నానమ్మ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో తన స్వగ్రామం ఊళ్లపాలెం వచ్చినట్లు తెలిపారు. తనకు న్యాయ, పోలీస్ వ్యవస్థలపై నమ్మకం ఉందని స్పష్టం చేశారు. అయితే తనది పూర్తిగా గ్రామీణ నేపథ్యం అని గుర్తు చేశారు. తన శాశ్వత చిరునామా ఊళ్లపాలెంకు ఎలాంటి నోటీసులు రాలేదని పేర్కొన్నారు.

VARTHAA SAKSHAMU
RNI Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR


## చెలిమిళ్ళ గ్రామంలో ప్రమాదవశాత్తు బావిలో జారిపడి మహిళ మృతి

**-కేసు నమోదు చేసి విచారణ చేపట్టిన ఎస్ఐ పి. తిరుపాలు**

**పాములపాడు జులై 28 వార్త సాక్ష్యం**





పాములపాడు మండల పరిధిలోని, చెలిమిళ్ళ గ్రామంలో మంగళవారం బి.రాణెమ్మ(45) భర్త ఏసన్న పొలం పనులకు వెళ్లి ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందడం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం బి.రాణమ్మ ఉదయము పోలం పనులకు వెళ్లడం జరిగింది. ఆమెకు దాహం వేయడంతో నీళ్లు తాగడానికి బావిలో దిగుతుండగా కాలుజారి బావిలో పడడం జరిగింది. గ్రామస్తులు వచ్చి తీసేలోపే ఆమె మరణించడం జరిగింది. మృతురాలికి భర్త, ఒక్క కుమారుడు, ఒక్క కూతురు ఉన్నారు. ఈ ప్రమాదంపై ఎస్సై పి.తిరుపాలు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని అంబులెన్స్ లో ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

## గ్రామీణ ప్రాంతాలలో దళితవాడలకు 4 ఎకరములు స్మశాన స్థలం ప్రభుత్వమే ఏర్పాటు చేయాలి

**-దళితశంఖారావంలో ప్రజాసంఘాలు డిమాండ్**



**ఆత్మకూరు జులై 28 వార్త సాక్ష్యం**

మండల పరిధిలోని నల్ల కాలువ గ్రామంలో మంగళవారం సామాజిక దళిత శంకరావం లో భాగంగా ఏపీ కౌలు రైతు లసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి సుధాకర్, రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి సి వెంకటేశ్వర్లు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఏ రణధీరు,మండల కార్యదర్శి రామ్ నాయక్, బృందంగా వెళ్లిరెండు మాల, మాదిగవాడలను సర్వే చేయడం జరిగింది. గ్రామంలో మెజార్టీగా 400 కుటుంబాలు కలిగి, సుమారు రెండువేల మంది జనాభా కలిగినటువంటి దళితులకు నేటికీ స్మశానం లేదని ప్రజా సంఘాల నాయకులకు దళితులు, ప్రజలు చెప్పడం జరిగింది. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి సుధాకర్ మాట్లాడుతూ, మాల పేట మాదిగ పేట లలో ప్రధానంగా స్మశానం లేకపోవడంతో స్థానిక ఊట చెరువులోగడ్డల పైన తాము శవాల ను పూడ్చుకునే పరిస్థితి ఉన్నదని దళితులు చెబుతున్నారంటే, ఈ ప్రభుత్వాలకు ఏమాత్రం చిత్తశుద్ధి ఉందో దళితుల స్థితిగతులు తేటతెల్లంగా కనపడుతుందని ఆయన అన్నారు. గతంలో కూడా అనేక సందర్భాలలో మండలంలోని స్మశానం లేని గ్రామాలలో స్థలం కేటాయించి, స్మశానం చుట్టూ ప్రహరి గోడ నిర్మించి, త్రాగునీటి వసతి ఏర్పాటు చేయాలని మండల రెవెన్యూ అధికారులకు విన్నవించిన అధికారులు పట్టించుకోవడంలేదని వారన్నారు. అట్లాగే కాలనీలలో డ్రైనేజీ లేక మురుగు కాలువలలో దోమల బారి నుండి రోగాల పాలవుతున్నారని వెంటనే జస్టిస్ పున్నయ్య కమిషన్, కోనేరు రంగారావు కమిషన్ ఆధారంగా 1235 జీవో ప్రకారం స్మశాన స్థలాలు కేటాయించి మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని వారు ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో పి శ్రీనివాసులు పి నాగన్న ప్రకాశం రమణ, కే మల్లయ్య బాలస్వామి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## వర్షాలు లేక రైతులు విల విల- భారీ పెట్టుబడి పెట్టి దిక్కుతోచని స్థితిలో రైతులు

**-ప్రభుత్వం,ఇన్సూరెన్స్ భీమా వాళ్ళు రైతులను ఆదుకోవాలని రైతుల ఆత్మ ఘోష**

**పాములపాడు జులై 28 సాక్ష్యం**



పాములపాడు మండల పరిధిలోని మిట్టకందాల, వాల్మీకినగర్, బుద్ధానగర్ గ్రామాల రైతులు వర్షాలు లేక పంటలు మొత్తం ఎండిపోతున్నాయని మరియు భూగర్భ జలాలు కూడా తీవ్రంగా అడుగంటి పొయ్యాయని త్రాగునీటి సమస్య కూడా ఉండడం వలన, తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని రైతులు వేదనకు గురవుతున్నారు. మంగళవారం బుద్దానగర్ గ్రామానికి చెందిన రైతు భావన శివయ్య, తదితర రైతులు ఒక ఎకరా ప్రత్తి వేసి రెండు నెలలు అయ్యిందన్నారు. విత్తనాలు విత్తిన దగ్గరినుంచి ఇంతవరకు వర్షం పది నిముషాలు కూడా పడలేదని చెప్పి, ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు ప్రభుత్వం భీమా కట్టమని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. మీ సేవా కేంద్రాలలో ఎకరాకు 1700/- ప్రకారము కట్టామన్నారు. కావున ప్రభుత్వం స్పందించి ఆర్థిక సహాయం చేయాలని రైతులు తమ గోడు ని, బాధలను మీడియాకు చెప్పారు.

# సంజీవనగర్ తండాలో ఘనంగా ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం







**ఆత్మకూరు జూలై 28 వార్త సాక్ష్యం**

రాష్ట్ర న్యాయ సేవాధి కార సంస్థ ఆదేశాల మేరకు కర్నూలు,జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి ఆధ్వర్యంలో మంగళవారం మండల పరిధిలోని , సంజీవనగర్ తాండ లో ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో జడ్జి మాట్లాడుతు ప్రకృతి ని పర్యావరనాన్ని ప్రతి ఒక్కరూ కాపాడాలని కోరారు. మానవ వన్య ప్రాణి దాడుల బాధితులకు న్యాయం పొందేందుకు సంబంధించిన జాతీయ న్యాయ సేవా అధికార సంస్థ పథకం 2025 అమలు పై తో అటవీ సరిహద్దు ప్రాంతాలలో వ్యవసాయ పొలాలలో చిరుతలు, పులులు, ఏనుగులు, అడవి పందుల దాడుల వలన ప్రాణాలు కోల్పోయిన మరియు పశు వులను, పంటలను కోల్పోయిన వారికి మరియు వారి కుటుంబ సభ్యులకు గవర్నమెంట్ నుండి నష్టపరిహారం లభిస్తుందని తెలిపారు. గిరిజనులకు ఏవైనా సమస్యలు ఉంటే లీగల్ సర్వీసెస్ టోల్ ఫ్రీ నెంబర్ 15100 పై కాల్ చేస్తే వారికి ఉచిత న్యాయ సహాయాన్ని అందిస్తామని తెలిపారు. లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శివరామ చంద్రరావు మాట్లడుతూ అడవి జంతువుల బాధితులకు పరిహారం అందించేందుకు అటవీశాఖ అధికారులు మీ సేవా ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కల్పించారని తెలిపారు. ఐటీడిఐ ప్రాజెక్ట్ ఆఫీసర్ గుండాల నాయక్ మాట్లడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము 2026 లో ప్రాజెక్ట్ హనుమాన్ను ప్రారంభించి వన్యప్రాణుల దాడుల బాధితులకు తక్షణ వైద్య సహాయం మరియు వేగవంతమైన నష్ట పరిహారాలను అందిస్తుందని తెలిపారు. ఆత్మకూరు పోలీస్ సబ్ డివిజనల్ అధికారి ఆర్.రామాంజి నాయక్ మాట్లడుతూ గిరిజనులు అటవీ భూములను కాపాడుకోవాలని చెట్లను కొట్టి వేయకుండా ప్రకృతి ని కాపాడాలని కోరారు. అనంతరం గిరిజనులకు నంద్యాల డిస్టిక్ అండ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేసి, వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సమావేశంలో, ఆత్మకూరు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ లక్ష్మి కుమారి, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ జాకిర్ హుస్సేన్ ఆత్మకూరు ఎంపీడీవో నాగేంద్రుడు, డిప్యూటీ ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఆత్మకూరు న్యాయ వాదులు భాస్కర్, బతుకులయ్య, అంకిరాజు, ప్యారా లీగల్ వాలెంటీర్స్ రమేష్, బలరాముడు, రాబిన్ సన్ రాజు, జుల్ఫికర్, యస్.యన్.తాండ సర్పంచ్ నాగులు నాయక్, డాక్టర్ పవన్ కుమార్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు మరియు ఐటీడిఐ అధికారులు, జిల్లా రెవిన్యూ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# పంట బీమా పంట నమోదు తప్పనిసరి పంట మార్పిడితో లాభాలు





**-మండల వ్యవసాయ శాఖ అధికారి.ఏఓ. పవన్ కుమార్**

**బండి ఆత్మకూరు జులై 28 వార్త సాక్ష్యం**

బండి ఆత్మకూరు మండలం పెద్దదేవలాపురం సంత జూటూరు గ్రామాలలో మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. పంటల బీమా పథకం ప్రాముఖ్యత, అర్హత, నమోదు విధానం మరియు ప్రకృతి వైపరీత్యాల సమయంలో పంట బీమా రైతులకు అందించే ప్రయోజనాల గురించి వివరించారు. రైతుల సాగు చేసిన ప్రతి పంటకు బీమా మరియు పంట నమోదు చేసుకోవాలని,ప్రస్తుత ఎల్నినో పరిస్థితుల్లో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నేల తేమ సంరక్షణ, సమతుల్య ఎరువుల వినియోగం, వాతావరణ ఆధారిత వ్యవసాయ యాజమాన్య పద్ధతులు మరియు పంట బెట్ట గురి అయినప్పుడు 19:19:19 నీటిలో కరిగే ఎరువును 1% ద్రావణంగా ఆకులపై పిచికారీ చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం అధికారులు మొక్కజొన్న మరియు పత్తి పంటలు క్షేత్రస్థాయిలో సందర్శించి పంటల ఎదుగుదల, నేలలో తేమ పరిస్థితులు, చీడపీడలు మరియు వ్యాధుల ఉనికిని పరిశీలించారు. రైతుల సమస్యలను తెలుసుకుని పంట పరిస్థితులకు అనుగుణంగా శాస్త్రీయ సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు వెటర్నరీ డాక్టర్ అనూష వ్యవసాయ విస్తరణ సిబ్బంది అర్ఫత్ పలువురు రైతులు పాల్గొన్నారు.

# కంపు--- కంపు

**-ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామాల్లో పడకేసిన పారిశుధ్యం**

**-గ్రామాల్లో కనిపించని ప్రత్యేక అధికారులు**

**బండి ఆత్మకూరు జులై 28 వార్త సాక్ష్యం**





బండి ఆత్మకూరు మండలంలోని చాలా గ్రామపంచాయతీలో పారిశుద్ధ్యం పడకేయడంతో కంపు కొడుతున్నాయి. రోడ్లపై నడిచే పాదచారులు ముక్కులు మూసుకొని వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది.. ఏ గ్రామ శివారులో చూసిన చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. సర్పంచుల కాలం ముగిసిన తర్వాత ప్రతి గ్రామానికి ఒక ప్రత్యేక అధికారిని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అయితే ప్రత్యేక అధికారులు చుట్టం చూపుగా కూడా గ్రామాల్లోకి వెళ్ళని వైనం. ఒకవైపు గ్రామాల అభివృద్ధి కోసం ప్రత్యేకంగా శిక్షణ కూడా ఇస్తున్నారు. ప్రభుత్వం అన్ని సదుపాయాలు అధికారులకు కల్పిస్తున్న అధికారులు అంతులేని నిర్లక్ష్యంతో గ్రామాల అభివృద్ధి పై దృష్టి సారించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. చాలా గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. డ్రైనేజీ పూడికతీత పనులు చేపట్టకపోవడంతో మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తుంది.

**-దిష్టిబొమ్మల్లా చెత్త సేకరణ కేంద్రాలు...**

గ్రామాల్లో సేకరించిన తడి చెత్త పొడి చెత్తను గ్రామాల్లో లక్షలాది రూపాయలు పెట్టి నిర్మించిన చెత్త సేకరణ కేంద్రాలు గ్రామాల్లో దిష్టిబొమ్మలుగా మారాయి. చెత్త సేకరణ కేంద్రాలకు చేరవలసిన చెత్తాచెదారం గ్రామ శివారులో కుప్పలుగా పోస్తున్నారు. ప్రభుత్వం లక్షలాది రూపాయలు పెట్టి నిర్మించిన చెత్త సేకరణ కేంద్రాలు ముళ్ళ పొదలతో శిథిలావస్థ దశకు చేరుకున్నాయి. చింత సేకరణ కేంద్రాల ద్వారా సంపద తయారుచేసి గ్రామపంచాయతీకి ఆదాయాన్ని పెంచుకోవాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో గ్రామ పంచాయతీ ఆదాయం పక్కనపెడితే గ్రామాల్లో మురికి కూపాలుగా తయారయ్యాయి. ఇప్పటికైనా జిల్లా అధికారులు బండి ఆత్మకూరు మండలం పై దృష్టి సారించి అల సత్వం వహిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు

# నంద్యాలలో హోరెత్తిన వైఎస్సార్‌సీపీ డీఎస్సీ నిరసన ర్యాలీ








**-నంద్యాలలో హోరెత్తిన వైఎస్సార్‌సీపీ నిరసన ర్యాలీ**
**-పట్టణంలో శ్రీనివాస సెంటర్ డా.వైఎస్సార్ విగ్రహం ఎదుట వద్ద కిక్కిరిసిన విద్యార్థులు, నిరుద్యోగులు.**
**-మెగా డీఎస్సీలో అక్రమాలపై సిబిఐ విచారణ జరిపించాలి**
**-నంద్యాల జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీ మాజీ ఎంపీ ల డిమాండ్.**
**-మంత్రి నారా లోకేష్ తక్షణమే రాజీనామా చేయాలి: కాటసాని రాంభూపాల్ రెడ్డి మండిపాటు.**

నంద్యాల జులై 28 వార్త సాక్ష్యం

నంద్యాలలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం చేపట్టిన నిరసన ర్యాలీ హోరెత్తింది. మంగళవారం పట్టణంలోని మెగా డీఎస్సీ నిర్వహణలో భారీగా అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ విద్యార్థులు, నిరుద్యోగులు పెద్ద ఎత్తున రోడ్లపైకి వచ్చారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయం నుంచి శ్రీనివాస సెంటర్ వరకు సాగిన ఈ ర్యాలీలో వేలాది మంది పాల్గొనడంతో శ్రీనివాస సెంటర్‌లోని డాక్టర్ వైఎస్సార్ విగ్రహం ప్రాంగణం జనసందోహంతో కిక్కిరిసిపోయింది. ముందుగా వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన పార్టీ నాయకులు, అనంతరం కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మెగా డీఎస్సీలో జరిగిన అవకతవకలకు బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తక్షణమే రాజీనామా చేయాలని వైఎస్సార్‌సీపీ డిమాండ్ చేసింది. డీఎస్సీ నియామకాలపై తక్షణమే సీబీఐ విచారణ జరిపించాలని కోరింది. ఈ నిరసన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డితో పాటు ఎమ్మెల్సీ ఇస్సాక్ బాష, మాజీ ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, మార్క్ ఫెడ్ మాజీ ఛైర్మన్ పీపీ నాగిరెడ్డి, నియోజకవర్గ పరిశీలకుడు సూర్యనారాయణ రెడ్డి, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు గుండం నాగేశ్వర రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, సురేష్, చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాష, మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, నంద్యాల పరిశీలకుడు సూర్యనారాయణ రెడ్డి,ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా విభాగం సెక్రటరీ శశికళ రెడ్డి మా మాజీ మున్సిపల్ చైర్మన్ మాబున్నీసా, నంద్యాల జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు సురేష్ , నంద్యాల జిల్లా కమిటీ జిల్లా వైసీ జిల్లా వైసీపీ సోమశేఖర్ రెడ్డి, వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి అనిల్ అమృతరాజ్ మున్సిపల్ వింగ్ అధ్యక్షుడు టైలర్ శివ సాయి రామ్ రెడ్డి,నంద్యాల జిల్లానంద్యాల ఎస్టీ సెల్ సెక్రెటరీశంకర్ నాయక్ అసెంబ్లీ యూత్ అధ్యక్షుడు శ్రీనివాసులు పాల్గొన్నారు అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు మాజీ ఎమ్మెల్యేలు మాజీ ఎంపీ ఎమ్మెల్సీలు మాట్లాడుతూ వైఎస్సార్సీపీ విద్యార్థి సంఘాల ఆద్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. మెగాడీఎస్సీలో అర్హత కలిగిన నిరుద్యోగ యువతకు అన్యాయం జరిగిందని ఆరోపించారు. ఇటీవల ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు ఒక్కసారి పెద్ద ఎత్తున తరలి వచ్చి ఉద్యమాన్ని చేపట్టి నీట్ లీక్ కు భాద్యులైన కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ను రాజీనామా చేసే వరకు పోరాటాన్ని ఆపలేదని గుర్తు చేశారు. అలాగే ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో నిర్వహించిన డీఎస్సీ నియామకాల్లో జరిగిన అవకతవకలపై బాధ్యతవహించి విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా సీబీఐ విచారణ చేపట్టాలని కోరారు. టెట్లో అర్హత లేకపోయినా కనీసం డిగ్రీ పాస్ కాకపోయినా టీచర్ ఉద్యోగాలను స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు కల్పించారని ఆరోపించారు. అర్హతలు ఉన్నవారికి ఉద్యోగాలు కల్పించలేదని వారికి అన్యాయం చేశారని విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. ఎస్సీఆర్టీ మార్గదర్శకాల ద్వార డీఎస్సీ నిర్వహించడం జరుగుతుందని, అయితే అందులో ఔట్ సోర్సింగ్ ఉద్యోగి అయిన నవీన్ అనే వ్యక్తి ఎన్.సీ తీసుకోకుండా డీఎస్సీ పరీక్షవ్రాసి స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించాడని, కంప్యూటర్ ఆపరేటర్ అయిన ఈ వ్యక్తి స్టేట్ ఫస్ట్ ఏలా వస్తాడని సూటిగా ప్రశ్నించారు. 420 టీచర్ ఉద్యోగాలను అర్హత లేని వారికి స్పోర్ట్స్ కోటాలో ఇవ్వడం జరిగిందని ఆరోపించారు. విద్యార్థుల, యువత శక్తిని మంత్రి లోకేష్ తక్కువ అంచనా వేస్తున్నారని, జంతర్ మంతర్లో జరిగిన ఉద్యమాలే తార్కాణం అని డిల్లీ కోటను బద్దలు కొట్టి వారి న్యాయమైన డిమాండ్లను సాధించారని పేర్కొన్నారు. మంత్రి నారాలోకేష్ రాజీనామా చేసేవరకు ఈ పోరాటాలు ఆగవని హెచ్చరించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఆందోళన కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధంగా ఉంటామని ప్రభుత్వానికి ఘాటుగా సవాల్ విసిరారు.

# ఆత్మకూరు పట్టు పరిశ్రమ శాఖలో..నా పట్టు -- నా అభిమానం” కార్యక్రమం






**-జిల్లా పట్టు పరిశ్రమ శాఖ అధికారి నాగేష్**
**-పట్టు మండలి శాస్త్రవేత్త డాక్టర్ అర్చన**

ఆత్మకూరు జులై 28 వార్త సాక్ష్యం

జిల్లాలో పట్టు పరిశ్రమ రైతులకు కూటమి ప్రభుత్వంలో అన్ని విధాలుగా రైతులకు సబ్సిడీ అందించే విధంగా అధికార యంత్రాంగం పనిచేస్తుందని నంద్యాల జిల్లా పట్టు పరిశ్రమ శాఖ అధికారి కే. నాగేష్, పట్టు పరిశ్రమ శాఖ కేంద్ర శాస్త్రవేత్త డాక్టర్ బి.ఆర్. అర్చన తెలిపారు మంగళవారం ఆత్మకూరు మండల పరిధిలోని పట్టు పరిశ్రమ శాఖ కార్యాలయంలో జరిగిన”నా పట్టు -- నా అభిమానం” కార్యక్రమం పై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పట్టు పరిశ్రమ శాఖ అధికారులు మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో పట్టు రైతులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై రైతులతో చర్చించారు ఈ సమావేశానికి జిల్లాలోని 20 మంది పట్టు రైతులు హాజరయ్యారు.అదేవిధంగా, రాబోయే కార్యక్రమాల అమలు, ఈ సంవత్సరానికి నిర్ణయించిన 150 ఎకరాల లక్ష్య విస్తీర్ణాన్ని సాధించేందుకు తీసుకోవా ల్సిన చర్యలు, అలాగే ఇతర అభివృద్ధి కార్యక్రమాలపై రైతులతో ముఖాముఖిగా మాట్లాడారు ఈ కార్యక్రమంలో పట్టు పరిశ్రమ రైతులు అధికారులు తదితరులు పాల్గొన్నారు

# ఎఫ్ఆర్ఎస్‌తోనే కార్మికుల హాజరు నమోదు

గుంటూరు, జులై 28 వార్త సాక్ష్యం :



పారిశుద్ధ్య కార్మికుల హాజరును ఫేస్ రికగ్నిషన్ సిస్టమ్ (ఎఫ్ఆర్ఎస్) ద్వారానే నమోదు చేయాలని, ప్రతిరోజూ ఉదయం 6 గంటలలోపు హాజరు ప్రక్రియ పూర్తి చేయాలని నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. ఆగస్టు 1 నుంచి కార్మికుల హాజరును జీతాలతో అనుసంధానం చేయనున్నందున ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మంగళవారం కెవీపీ కాలనీ, జాతీయ రహదారి సర్వీస్ రోడ్డు, ఏటుకూరు, వస్త్రనగర్, తారకరా మనగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించిన కమిషనర్ జీఎంసీకి చెందిన ఖాళీ స్థలాలను పరిశీలించి వాటి అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్య పనులు, కార్మికుల హాజరుపై ప్రజారోగ్య అధికారులకు, డ్రైన్లు, వాకింగ్ ట్రాక్‌ల అభివృద్ధిపై ఇంజినీరింగ్ అధికారులకు, మొక్కల పెంపుపై ఏడీహెచ్‌కు తగిన సూచనలు చేశారు.ఆగస్టు 1 నుంచి హాజరు ఆధారంగానే వేతనాలు చెల్లించను న్నందున ఏ కార్మికుడికి జీతం అందకపోయినా సంబంధిత శానిటరీ ఇన్‌స్పెక్టర్ పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. నగరంలోని ఖాళీ స్థలాలను వెంటనే శుభ్రపరిచి పరిశుభ్రంగా ఉంచాలని, ప్రధాన రహదారుల వెంట పిన్ పాయింట్ ప్రోగ్రామ్ ప్రకారం విస్తృతంగా మొక్కలు నాటాలని ఆదేశించారు.రోడ్లపై ఆక్రమణలు తొలగిం చడం, పార్కుల అభివృద్ధికి గుర్తించిన స్థలాల్లో మార్కింగ్ పనులను గడువులోగా పూర్తి చేయాలని పట్టణ ప్రణాళిక అధికారులకు సూచించారు. ఏటుకూరు చెరువు వాకింగ్ ట్రాక్ వెంట మొక్కలు నాటి, అవసరమైన మరుగుదొడ్లు నిర్మించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. గాయత్రి నగర్‌లో తాగునీటి సమస్యపై స్పందించిన కమిషనర్, శాశ్వత పరిష్కారం లభించే వరకు ప్రతిరోజూ ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పర్యటనలో డిప్యూటీ కమిషనర్ బి. శ్రీనివాసరావు, ఎస్ఈ సుందర్రామిరెడ్డి, డీసీపీ సూరజ్ కుమార్, ఈఈ వేణుగోపాల్, డీఈఈ సతీష్ కుమార్, ఎంహెచ్‌వో డాక్టర్ సురేష్‌తో పాటు పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య శాఖల అధికారులు పాల్గొన్నారు.

## డ్రోన్లతో సీడ్ బాల్స్.. అడవులకు పచ్చదనం



గుంటూరు, జులై 28 వార్త సాక్ష్యం

రాష్ట్రంలో తొలిసారిగా డ్రోన్ సాంకేతికతతో అడవుల్లో సీడ్ బాల్స్ వెదజల్లే కార్యక్రమానికి అటవీశాఖ శ్రీకారం చుట్టింది. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు గుంటూరు డివిజన్ పరిధిలోని గుంటూరు రేంజ్, కొండవీడు రిజర్వు అటవీ ప్రాంతంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.జిల్లా అటవీ అధికారి ఎం. హిమ శైలజ మాట్లాడుతూ, అడవులు క్షీణించిన ప్రాంతాల్లో పచ్చదనాన్ని పునరుద్ధరించేందుకు డ్రోన్ సాంకేతికతను వినియోగిస్తున్నట్లు తెలిపారు. మనుషులు సులభంగా చేరుకోలేని దట్టమైన అటవీ ప్రాంతాల్లోనూ సీడ్ బాల్స్ జారవిడిచేలా ఈ విధానాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో డ్రోన్ టెక్నాలజీతో సీడ్ బాల్స్ వెదజల్లే కార్యక్రమం చేపట్టడం ఇదే తొలిసారని పేర్కొన్నారు.గుంటూరు అటవీ రేంజ్ పరిధిలో మొత్తం మూడు లక్షల సీడ్ బాల్స్ తయారు చేసి వాటిని దశలవారీగా డ్రోన్ల ద్వారా వెదజల్లుతున్నట్లు తెలిపారు. క్షీణించిన అటవీ ప్రాంతాలను గుర్తించి పునరుద్ధరణ చర్యలు చేపడుతున్నామని, రాష్ట్రవ్యాప్తంగా పచ్చదనం పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని వివరించారు.ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ డి. పోతురాజు, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## చేతులు కోల్పోయిన దివ్యాంగులకు ఉచిత కృత్రిమ చేతులు



నరసరావుపేట,జులై 28 వార్త సాక్ష్యం

ప్రమాదాలు, విద్యుత్ షాక్‌లు, కర్మాగారాల్లో జరిగే ప్రమాదాల కారణంగా చేతులు కోల్పోయిన దివ్యాంగులకు ప్రాణదానం ట్రస్ట్ ఆధ్వర్యంలో అత్యాధునిక బ్యాటరీతో పనిచేసే కృత్రిమ చేతులను ఉచితంగా అందజేయనున్నట్లు జిల్లా కలెక్టర్ శ్రీమతి కృతికా శుక్ల తెలిపారు.నరసరావుపేటలోని రాధా సుందర్ కళ్యాణ మండపంలో ఆగస్టు 6, 7 తేదీల్లో నిర్వహించే కార్యక్రమంలో సుమారు 200 మంది దివ్యాంగులకు లక్షల రూపాయల విలువైన కృత్రిమ చేతులను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. అర్హులైన బాధితులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని కార్యక్రమానికి హాజరై కృత్రిమ చేతులను పొందాలని సూచించారు.ప్రాణదానం ట్రస్ట్ నిర్వాహకుడు రావిపాటి శ్రీనివాస్ (కిరణ్) ఆధ్వర్యంలో ఈ సేవా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ట్రస్ట్ గౌరవ సలహాదారు కె.పీ. రంగారావు మాట్లాడుతూ, చేతులు కోల్పోయి జీవనోపాధిలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి ఈ కృత్రిమ చేతులు కొత్త ఆశను కల్పిస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమం నిర్వహణకు లక్షల రూపాయల వ్యయం అవుతున్నప్పటికీ, పూర్తిగా ఉచితంగా సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు.ఉచిత కృత్రిమ చేతులు పొందాలనుకునే వారు ప్రాణదానం ట్రస్ట్, నరసరావుపేటను 70134 63637 నంబర్‌లో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

## వార్డుల వారీగా పిన్‌పాయింట్ ప్రణాళిక

గుంటూరు, జులై 28 వార్త సాక్ష్యం



గుంటూరు నగరంలో ఇంటింటి, వాణిజ్య సంస్థల నుంచి నూరు శాతం చెత్త సేకరణ జరిగేలా వార్డుల వారీగా పిన్‌పాయింట్ ప్రోగ్రామ్ రూపొందించాలని నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. మంగళవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో ఈ-ఆటోలు, మెకానికల్ స్వీపింగ్ యంత్రాలు, జీపీఎస్ ట్రాకింగ్, మ్యాపింగ్ అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. త్వరలో అందుబాటులోకి రానున్న 200 ఈ-ఆటోలతో వార్డులు, సచివాలయాల వారీగా క్షేత్రస్థాయి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. ప్రతి వాహనానికి కేటాయించిన ప్రాంతాన్ని మ్యాపింగ్ చేసి, జీపీఎస్ ట్రాకర్‌తో పాటు ప్రతి ట్రిప్‌లో సేకరించిన చెత్త బరువు నమోదయ్యేలా వ్యవస్థ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నగరపాలక సంస్థకు ఉన్న 10 మెకానికల్ స్వీపింగ్ యంత్రాలతో ఎంపిక చేసిన 10 ప్రధాన రహదారుల్లో సుమారు 241 కిలోమీటర్ల మేర రాత్రి వేళల్లో స్వీపింగ్ నిర్వహించి వాయు కాలుష్యాన్ని తగ్గించాలని సూచించారు. ఈ-ఆటోలు, స్వీపింగ్ యంత్రాలు నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం పనిచేసేలా ప్రజారోగ్య, ఇంజినీరింగ్ శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని, పారిశుద్ధ్య సేవలపై ప్రజలకు సంతృప్తి కలిగేలా పనితీరును మెరుగుపరచాలని కమిషనర్ స్పష్టం చేశారు. సమావేశంలో ఎంహెచ్‌వో డాక్టర్ సురేష్, శానిటరీ సూపరింటెండెంట్లు రాజేష్, ఐజాక్, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ స్పెషలిస్ట్ అనిల్ కుమార్, ఈ-ఆటోల ఏజెన్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

VARTHA SAKSHAMU
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR


## అర్హత కలిగిన ప్రతి విద్యార్థికి తల్లికి వందనం అందించాలి... కలెక్టర్ వినోద్ కుమార్

బాపట్ల జులై 28 వార్త సాక్ష్యం



తల్లికి వందనం పథకం అర్హత కలిగిన ప్రతి విద్యార్థికి అందేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వి. ఆదేశించారు. తల్లికి వందనం పథకం అమలు, వాట్సాప్ గవర్నెన్స్ సేవల పురోగతిపై మంగళవారం కలెక్టరేట్ నుంచి నిర్వహించిన వీక్షణ సమావేశంలో ఆయన మాట్లాడారు.జిల్లాలో తల్లికి వందనం నగదు పంపిణీ సమర్థంగా జరిగిందని కలెక్టర్ తెలిపారు. లబ్ధిదారులైన విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాలకు నగదు జమైందని, అయితే సాంకేతిక కారణాల వల్ల 5,986 మంది లబ్ధిదారులకు నగదు జమ కాకపోవడాన్ని సమీక్షించి, సమస్యలను వెంటనే పరిష్కరించి అర్హులందరికీ నగదు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.వాట్సాప్ గవర్నెన్స్ సేవలను ప్రజలు విస్తృతంగా వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. ఈ సేవల అమలులో ఆంధ్రప్రదేశ్ దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. ఇంకొల్లు మండలంలో సేవల అమలు సంతృప్తికరంగా ఉండగా, చీరాల మండలంలో పురోగతి ఆశించిన స్థాయిలో లేకపోవడంపై ఆరా తీశారు. ప్రతి మండలంలో కనీసం వంద సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని, గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా వాట్సాప్ గవర్నెన్స్ సేవలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ఆదేశించారు.సమావేశంలో డీఆర్వో జి. గంగాధర్ గౌడ్, డీఈవో శ్రీనివాసు సింగ్, స్వర్ణ గ్రామ, వార్డు సచివాలయాల ఇన్‌చార్జి అధికారి రాజేష్, ఎంపీడీవోలు, ఎంఈవోలు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు పంట బీమా భరోసా



రెంటచింతల జులై 28 వార్త సాక్ష్యం

వ్యవసాయ శాఖ అమలు చేస్తున్న పంటల బీమా పథకంలో రైతులందరూ తమ పేర్లను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కట్టా లక్ష్మారెడ్డి కోరారు.మంగళవారం ఆయన మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులు ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. పంటల బీమా కింద వరి పంటకు ఎకరాకు రూ.80, కందికి రూ.40, పత్తికి రూ.1,900, మిరపకు రూ.360 ప్రీమియం చెల్లించాలని తెలిపారు. పంట నష్టం సంభవిస్తే వరికి రూ.40 వేల వరకు, మిరపకు రూ.90 వేల వరకు, పత్తికి రూ.38 వేల వరకు పరిహారం అందజేస్తామని పేర్కొన్నారు. వరి పంట బీమా ప్రీమియాన్ని ఆగస్టు 15లోపు, మిగిలిన పంటలకు ఈ నెలాఖరులోపు చెల్లించాలని స్పష్టం చేశారు. రైతులు తాము సాగు చేసిన పంటలను సంబంధిత రైతు సేవా కేంద్రం సిబ్బందిని కలిసి వెంటనే నమోదు చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి కట్టా లక్ష్మారెడ్డి, రాంబాబు నాయక్, రైతులు పాల్గొన్నారు.

## భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి ఎమ్మెల్యే యరపతినేని

గురజాల జులై 28 వార్త సాక్ష్యం



గురజాల నియోజకవర్గంలో రైతులకు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలు, వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడమే ప్రభుత్వ లక్ష్యమని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. రాష్ట్ర రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో భాగంగా గురజాల పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో మండల రెవెన్యూ అధికారుల సమీక్ష సమావేశం, రెవెన్యూ సదస్సు నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, ఆర్డీవో మురళీకృష్ణ హాజరై ప్రజల నుంచి నేరుగా అర్జీలను స్వీకరించారు.ఈ సందర్భంగా ప్రజలు ఎదుర్కొంటున్న భూ సమస్యలు, రెవెన్యూ వివాదాలపై వచ్చిన అర్జీలను పరిశీలించిన ఎమ్మెల్యే, వాటిని త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన రెవెన్యూ సేవలు అందించేందుకు అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు.

## శ్రీశైలంలోధర్మకర్తల మండలి సమావేశంలో పలు కీలక నిర్ణయాలు





**-ఆగష్టు 15 నుంచి ప్రోటోకాల్ దర్శనాలలో సంస్కరణాత్మక మార్పులు**

**-వర్షాభావ పరిస్థితులు తొలగేందుకు ఆగమశాస్త్రానుసారంగా వరుణయాగ సహిత సహస్రఘటాభిషేకం**

**-దేవస్థానం దత్తత దేవాలయమైన కడప జిల్లాలోని జ్యోతిస్సిద్ధవట ఆలయంలో అభివృద్ధి పనులు**

**-ఆగష్టు 7న కొలనుభారతి క్షేత్రంలో శాకంభరీ ఉత్సవం**

**-ఆలయ ఈవో ఎం శ్రీనివాసరావు, ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు**

శ్రీశైలం జులై 28 వార్త సాక్ష్యం

శ్రీశైల దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు పోతుగుంట రమేష్‌నాయుడు అధ్యక్షతన ధర్మకర్తల మండలిలో 9వ సమావేశం నిర్వహించారు మంగళ వారం ఆలయ కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాస రావు, ధర్మకర్తల మండలి సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు మొత్తం 45 అంశాలు చర్చించ బడ్డాయి. వీటిలో 39 అంశాలు ఆమోదించబడ్డాయి. మిగతా 6 అంశాలను వాయిదా వేయడం సమావే శంలో అజెండా అంశాలతో పాటు శాకంభరీ ఉత్సవ నిర్వహణ, శ్రావణమాసోత్సవాలు, సహస్రఘ టాభిషే కం శాకంభరీ ఉత్సవాన్ని సంప్రదాయ బద్ధంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. అదేవి ధంగా రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు తొలగి, సకాలంలో వర్షాలు కురిసి, పంటలు బాగా పండేందుకు రాష్ట్రం మరియు దేశం సస్యశ్యామలంగా ఉండేందుకు తలపెట్టిన వరుణయాగ సహిత సహస్రఘటాభిషేకం ఆగమశాస్త్రానుసారంగా జరిపించడం జరుగుతుం దన్నారు. వరుణయాగం, శ్రీస్వామివారికి సహస్రఘ టాభిషేకం, స్వామిఅమ్మవార్లకు విశేషార్చనలు, కార్యక్రమ సంబంధి హోమాలు, జపాలు, పారాయణ లు శాస్త్రోక్తంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటు న్నామన్నారు. అదేవిధంగా ఎటువంటి లోటుపాట్లు లేకుండా రాబోవు శ్రావణమాసోత్సవాలను నిర్వహిస్తా మన్నారు. శ్రావణమాసంలో భక్తులరద్దీని దృష్టిలో ఉంచుకుని దర్శన ఏర్పాట్లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా సామాన్య భక్తులకు సంతృప్తికరమైన దర్శనం జరిగేవిధంగా తగు చర్యలు చేపట్టడం జరుగుతుం దన్నారు. కాగా సమావేశంలో తీసుకోబడిన ముఖ్యమైన నిర్ణయాల గురించి ధర్మకర్తల మండలి అధ్యక్షులు పోతుగుంట రమేష్‌నాయుడు వివరిం చారు. ఆగష్టు 15 నుంచి ప్రోటోకాల్ దర్శనాలలో సంస్కరణాత్మక మార్పులు. టి.టి.డి తరహాలో నిర్దిష్టమైన విధానం అమలు. సిఫారసు లేఖలు కనీసం 48 గంటలు ముందస్తుగా పంపడం తప్పని సరి. ప్రోటోకాల్ టికెట్ల జారీలో పూర్తి పారదర్శకత. సామాన్య భక్తులకు ఇబ్బందులు కలగకుండా నిర్దిష్ట వేళలలో మాత్రమే ప్రోటోకాల్ దర్శనాలు. ప్రోటోకాల్ దర్శనాలు జారీకి కూడా ఆన్‌లైన్ విధానం అమలు. లోకకల్యాణం కోసం ఆగస్టు 7.వ తేదీ నుండి 11వ తేదీ వరకు వరుణయాగ సహిత సహస్రఘటాభిషేకం ఆగమశాస్త్రానుసారంగా జరిపించారు శ్రీశైలదేవ స్థానం దత్తత దేవాలయమైన కొలను భారతిలో ఆగష్టు 7 శుక్రవారం రోజు సరస్వతీ అమ్మవారికి శాకంభరీ ఉత్సవాన్ని నిర్వహించాలని నిర్ణయించడం జరిగింది. శ్రీశైలదత్తత దేవాలయమైన జ్యోతిస్సిద్ధవట ఆలయ జీర్ణోద్ధారణ చేయాలని తీర్మానించడమైనది. దశల వారిగా ఈ ఆలయంలో ఆయా అభివృద్ధి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవడం జరుగు తుంది. ఇందుకు అవసరమైన అంచనాలను త్వరలోనే రూపొందించడం జరుగుతుంది. ఆలయ ముందు భాగంలో సాలుమండపాల నిర్మాణం ప్రస్తుతా నికి వాయిదా వేయడం జరిగింది. అయితే క్యూకాంప్లెక్సు నిర్మాణం, క్షేత్రపరిధిలో శౌచాలయాల నిర్మాణం, తిరుమల తరహాలో ఫిలిగ్రిమ్ అమినిటీస్ కాంప్లెక్సు నిర్మాణం, సాలుమండపాల నిర్మాణం మొదలైనవన్నీ ప్రాధాన్యతా క్రమములో చేపట్టడం జరుగుతుంది. సామాన్య భక్తుల సౌకర్యార్థం క్షేత్రపరిధిలో ఎంపిక చేసిన 20 ప్రదేశాలలో శౌచాలయాలను నిర్మించాలని నిర్ణయించడం జరిగింది. ఒక్కొక్క బ్లాక్ నందు 11 గదులు ఉండేవిధంగా వీటి నిర్మాణం చేపట్టబడుతుంది. ఒక్కొక్క బ్లాక్ నిర్మాణానికి సుమారు రూ. 25 లక్షల అంచనా వ్యయంతో టైప్ --ఎ మోడల్ నందు నిర్మించడం జరుగుతుంది. ఒక్కొక్క బ్లాక్‌లో అదనంగా స్నానపుగదులు కూడా ఏర్పాటు చేయబడు తాయి. భక్తుల సౌకర్యార్థం హిందూమాల సత్రం నుంచి కుమార సదనం వరకు, మరియు యోగి వేమారెడ్డి సత్రం వెనుకభాగంలో రూ. 24లక్షల అంచనా వ్యయంతో సిమెంట్ కాంక్రీట్ రోడ్డు నిర్మిం చాలని తీర్మానించడం జరిగింది. శ్రావణమా సోత్సవాలలో ప్రధాన గోపురాలకు విద్యుద్దీపా లంకరణ చేయాలని నిర్ణయించడం జరిగింది. భక్తుల సౌకర్యార్థం నందీశ్వర డార్మెటరీలో డక్టబుల్ ఎయిర్ కూలర్ ఏర్పాటు చేయాలని తీర్మానించడమైనది. దీని అంచనా వ్యయం రూ. 39 లక్షలు. అదేవిధంగా నీలకంఠేశ్వర డార్మెటరీ నందు కూడా డక్టబుల్ ఎయిర్ కూలర్ ఏర్పాటు చేయాలని తీర్మానిం చడమైనది. దీని అంచనా వ్యయం రూ.23 లక్షలు. భక్తుల సౌకర్యార్థం క్యూ కాంప్లెక్సు నందు అదనపు వాటరు కూలర్సును ఏర్పాటు చేయాలని తీర్మానిం చడమైనది. వీటి అంచనా వ్యయం రూ. 5లక్షలుఇ -- ప్రొక్యూర్మెంట్ టెండరు విధానంలో పిలువబడిన టెండర్లను అనుసరించి రాబోవు 2027 సంవత్సరపు వివిధ రకాల క్యాలెండర్లను మరియు రెండు రకాల డైరీలను ముద్రించాలని నిర్ణయం. స్వామివారి ఆలయం నుంచి అమ్మవారి ఆలయం వరకు రూ. 39.90 లక్షల అంచనా వ్యయంతో స్టెయిన్ లెస్ స్టీల్ క్యూలైన్ల ఏర్పాటు అన్నప్రసాద వితరణ భవనములో కూడా రూ. 39.90 లక్షల అంచనా వ్యయంతో స్టెయిన్ లెస్ స్టీల్ క్యూలైన్ల ఏర్పాటు చేసే విధంగా చొరవ తీసుకోవాలని చెప్పారు.

## అభివృద్ధే కూటమి లక్ష్యం

కారంపూడి జులై 28 వార్త సాక్ష్యం



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా అమలవుతున్నాయని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కారంపూడి మండలం పెదకొదమగండ్ల గ్రామంలో నిర్వహించిన 'ఇంటింటికీ తెలుగుదేశం' ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యేకు ప్రజలు, కూటమి నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. డీజే మోతలు, తీన్మార్ డప్పుల నడుమ ప్రధాన వీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఇంటింటికీ ప్రచారాన్ని ప్రారంభించారు. ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించడంతో పాటు సుపరిపాలనపై ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కారంపూడి మండల అభివృద్ధికి గత రెండేళ్లలో రూ.87.40 కోట్లు, సంక్షేమ పథకాలకు రూ.116.28 కోట్లు వ్యయం చేశామని తెలిపారు. అలాగే పెదకొదమగండ్ల గ్రామంలో సంక్షేమ కార్యక్రమాలకు రూ.10.40 కోట్లు, అభివృద్ధి పనులకు రూ.2 కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడించారు.కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## లోకేష్‌పై విమర్శలు సరికావు రాష్ట్ర శిల్పారామం చైర్మన్ మంజులా రెడ్డి

రెంటచింతల జులై 28 వార్త సాక్ష్యం



మెగా డీఎస్సీని విజయవంతంగా నిర్వహించి వేలాది మంది నిరుద్యోగ ఉపాధ్యాయుల ఆశలను నెరవేర్చిన మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని వైసీపీ నేతలు డిమాండ్ చేయడం అవివేకమని రాష్ట్ర శిల్పారామం చైర్మన్ చేర్రెడ్డి మంజులారెడ్డి విమర్శిం చారు. మంగళవారం రెంటచింతలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, డీఎస్సీ నిర్వహణను అడ్డుకునేందుకు వైసీపీ నాయకులు పిటిషన్లు వేయించి, కోట్ల రూపాయలు ఖర్చు చేశారని ఆరోపించారు. డీఎస్సీ పూర్తై ఏడాది గడిచిన తర్వాత అక్రమాలు జరిగాయని ఆరోపించడం రాజకీయ దురుద్దేశానికే నిదర్శనమని అన్నారు.ఆధారాలు లేకుండా, పొంతనలేని ఆరోపణలతో మంత్రి లోకేష్ రాజీనామా చేయాలని కోరడం హాస్యాస్ప దమని, ఉపాధ్యాయులు సైతం అలాంటి వ్యాఖ్యలను చూసి నవ్వుకుంటున్నారని పేర్కొన్నారు. అబద్ధాలను పదేపదే ప్రచారం చేసి నిజాలుగా చూపించే ప్రయత్నం వైసీపీ చేస్తోందని విమర్శించారు.వైసీపీ ఐదేళ్ల పాలనలో ఒక్క ఉపాధ్యాయ పోస్టును కూడా భర్తీ చేయలేదని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం చేపడుతున్న నియామకాలు, సంక్షేమ కార్యక్రమాలకు ప్రజల్లో వస్తున్న ఆదరణను జీర్ణించుకోలేక ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని మంజులారెడ్డి మండిపడ్డారు.విలేకరుల సమావేశంలో వెన్నా కృష్ణారెడ్డి, నాళం పెదబాబు, సైదులు యాదవ్, ఆకుల నరశింహారావు, ఎనిగండ్ల అప్పయ్య, వైవీ సైదయ్య, నారాయణపురం శ్రీనివాసరావు, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సమస్యలు పరిష్కరించాలి

ముండ్లమూరు జులై 28 వార్త సాక్ష్యం

పొగాకు రైతులను ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ముండ్లమూరు మండల కార్యదర్శి పంటా ఏడుకొండలు విమర్శించారు. ముండ్లమూరు మం డలం మారెళ్ల గ్రామంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో పొగాకు రైతుల బైక్ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఏడుకొండలు మాట్లాడుతూ పొగాకు రైతులకు రూ.1,000 కోట్లు కేటాయించి, రైతుల వద్ద ఉన్న పొగాకును ప్రభుత్వమే కొనుగోలు చేసి గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు.వేంపాడు గ్రామం నుంచి ప్రారంభమైన బైక్ ర్యాలీ మారెళ్ల, జమ్మలమడక, మక్కినేని వారి పాలెం, కొండలరాయుని పాలెం, భీమవరం, బొబ్బిలి వారి పాలెం, పూరిమెట్ల, పోలవరం గ్రామాల మీదుగా సాగింది. పొగాకు రైతుల సమస్యల పరిష్కారం కోసం త్రోవగుంట బైపాస్ వద్ద నిర్వహించనున్న రాస్తారోకో కార్యక్ర మాన్ని విజయవంతం చేయాలని రైతులకు పిలుపుని చ్చారు.కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు, సీపీఎం మండల కార్యదర్శి వెల్లంపల్లి ఆంజనేయులు, సీపీఐ మండల కార్యదర్శి సుంకర అంజిరెడ్డి, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి బి. రఘురాం తదితరులు పాల్గొన్నారు.



VARTHAA SAKSHAMU
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
బుధవారం 29 జూలై 2026

# పంచాయతీ అధికారులకు మెరుగైన శిక్షణ అందించాలి

బాపట్ల, జులై 28 వార్త సాక్ష్యం

జిల్లా, మండల, గ్రామ స్థాయిలో సమగ్ర గ్రామ స్వపరిపాలన లక్ష్యంగా పంచాయతీరాజ్ అధికారులకు నాణ్యమైన శిక్షణ అందించాలని ఏపీఎస్ఐఆర్డీ--పీఆర్ కమిషనర్ ముత్యాలరాజు అధికారులను ఆదేశించారు. మంగళవారం బాపట్ల విస్తరణ శిక్షణ కేంద్రంలో ఆయన అధ్యక్షతన మేనేజింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో 2025-26 వార్షిక ప్రణాళిక ప్రకారం వివిధ స్థాయిలకు చెందిన 3,676 మంది అధికారులకు శిక్షణ అందించినట్లు సమీక్షించారు. 2026-27 వార్షిక ప్రణాళికలో ఇప్పటివరకు 870 మందికి శిక్షణ పూర్తయిందని, వార్షిక ప్రణాళిక ముగిసేలోపు గత ఏడాదికంటే ఎక్కువ మంది అధికారులు, ప్రజాప్రతినిధులకు శిక్షణ అందించేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ సూచించారు. రాబోయే మూడు నెలల్లో పంచాయతీ అభివృద్ధి అధికారులు (పీడీవోలు), డిప్యూటీ మండల పరిషత్ అభివృద్ధి అధికారులు (డీఎంపీడీవోలు), మండల పరిషత్ అభివృద్ధి అధికారులు (ఎంపీడీవోలు)లకు ప్రభుత్వ వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలుపై సమగ్ర శిక్షణ నిర్వహించనున్నట్లు తెలిపారు. శిక్షణా కార్యక్రమాలు విజయవంతం అయ్యేలా విస్తరణ శిక్షణ కేంద్రం సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.




సమావేశంలో అడిషనల్ డైరెక్టర్ కె.ఎస్. వరప్రసాద్, విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ డి. వెంకట్రావు, వైస్ ప్రిన్సిపాల్ పి. పద్మజ, జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి వి. జ్యోతిబసు, బాపట్ల డివిజినల్ అభివృద్ధి అధికారి సి.హెచ్. విజయలక్ష్మి, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి కె.ఎల్. ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

# భ్రమరా వెంచర్‌లో అనుమతుల మిస్టరీ

-100 ఎకరాల ప్రచారం.. 52 ఎకరాలకే అనుమతులా?
-42 ఎకరాలపై రెవెన్యూ ఫోకస్
-రైతుల ఫిర్యాదుతో వెలుగులోకి కొత్త అంశాలు
-కలెక్టర్ కోర్టులో విచారణ.. ఉత్కంఠ

ఉమ్మడి గుంటూరు జులై 28 వార్త సాక్ష్యం

మార్కాపురంలోని భ్రమరా వెంచర్ వివాదంలో కొత్త అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. వంద ఎకరాలకు అనుమతులున్నాయని ప్రచారం చేస్తున్న వెంచర్‌కు, రెవెన్యూ విచారణలో కేవలం 52 ఎకరాలకే అనుమతులు ఉన్నట్లు ప్రాథమికంగా తేలినట్టు సమాచారం. మిగిలిన భూములపై విచారణ కొనసాగుతుండటంతో రియల్ ఎస్టేట్ వర్గాల్లో తీవ్ర చర్చ నెలకొంది.మార్కాపురం భ్రమరా వెంచర్ వివాదం రోజురోజుకూ కొత్త మలుపులు తిరుగుతోంది. గుంటూరు ఎమ్మెల్యే గల్లా మాధవి భర్త రామచంద్రరావుతో సంబంధం ఉన్న ఈ వెంచర్‌పై ఇప్పటికే రాజకీయంగా తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తగా, ప్రస్తుతం రెవెన్యూ శాఖ చేపట్టిన విచారణలో కీలక అంశాలు బయటపడుతున్నట్లు తెలుస్తోంది. స్థానిక ఎమ్మెల్యే జోక్యం, రైతుల ఫిర్యాదులు, కలెక్టర్ ఆదేశాలతో సాగుతున్న విచారణ ఇప్పుడు వెంచర్ చట్టబద్ధతపైనే ప్రశ్నలు లేవనెత్తుతోంది.దాదాపు 100 ఎకరాలకు అన్ని అనుమతులు ఉన్నాయని వెంచర్ నిర్వాహకులు ప్రచారం చేస్తున్నప్పటికీ, రెవెన్యూ శాఖ ప్రాథమిక పరిశీలనలో సుమారు 52 ఎకరాలకు మాత్రమే సంబంధిత అనుమతులు ఉన్నట్లు గుర్తించినట్టు సమాచారం. మిగిలిన 42 ఎకరాలకు అవసరమైన అనుమతులు లేవని అధికారులు పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు వెంచర్ అభివృద్ధి పనులు మాత్రం దాదాపు 150 ఎకరాల వరకు జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. దీంతో అసలు అనుమతులు ఎన్ని ఎకరాలకు ఉన్నాయి? అభివృద్ధి ఎంత మేర జరిగింది? అనే అంశాలపై అధికారులు లోతుగా విచారణ చేస్తున్నారు.వివాదానికి ప్రధాన కారణం రైతుల రాకపోకల దారి మూసివేత. వెంచర్ అభివృద్ధి ప్రారంభ సమయంలో రైతుల నుంచి దారి కోసం కొంత భూమిని తీసుకున్న నిర్వాహకులు, అనంతరం భారీ గేట్లు ఏర్పాటు చేసి పొలాలకు వెళ్లకుండా అడ్డుకున్నారన్న ఆరోపణలు వచ్చాయి.



దీంతో రైతులు స్థానిక ఎమ్మెల్యేను, జిల్లా కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. కలెక్టర్ జోక్యంతో రెవెన్యూ శాఖ క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టింది. విచారణలో కొన్ని భూములు అసైన్డ్ లేదా ప్రభుత్వ భూముల పరిధిలో ఉన్నాయా అనే కోణంలో కూడా అధికారులు పరిశీలిస్తున్నట్లు సమాచారం. రికార్డులు, సర్వే నంబర్లు, లేఅవుట్ పరిమితులు, రిజిస్ట్రేషన్ వివరాలను సరిపోలుస్తూ సమగ్ర నివేదిక సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ వ్యవహారం కలెక్టర్ కోర్టు పరిధిలో ఉండటంతో తుది నిర్ణయంపై ఆసక్తి నెలకొంది.లేఅవుట్‌కు చట్టబద్ధంగా ఉండాల్సిన అనుమతులు.. నిపుణుల అభిప్రాయం ప్రకారం ఏ లేఅవుట్ అయినా అభివృద్ధి చేసి ప్లాట్ల విక్రయాలు చేపట్టాలంటే సంబంధిత పట్టణాభివృద్ధి లేదా ప్రణాళికా సంస్థ (DTCP/అభివృద్ధి సంస్థ) నుంచి లేఅవుట్ ఆమోదం తప్పనిసరి. భూ వినియోగం (ల్యాండ్ యూజ్) నిబంధనలకు అనుగుణంగా ఉండాలి. అవసరమైన రహదారులు, డ్రైనేజీ, పార్కు, ఓపెన్ స్పేస్ రిజర్వేషన్ వంటి ప్రమాణాలు పాటించాలి. వ్యవసాయ భూమిని నివాస అవసరాలకు వినియోగిస్తే సంబంధిత చట్టాల ప్రకారం అవసరమైన మార్పిడి, ఇతర అనుమతులు కూడా ఉండాలి.అనుమతులు లేకుండా విక్రయిస్తే? అనుమతులు లేకుండా ప్లాట్ల విక్రయాలు జరిగినట్లు తేలితే సంబంధిత అధికారులు విక్రయాలను నిలిపివేయడం, అక్రమ అభివృద్ధిని అడ్డుకోవడం, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడం, అవసరమైతే చట్టపరమైన కేసులు నమోదు చేయడం వంటి చర్యలు చేపట్టే అవకాశం ఉంటుంది. కొనుగోలుదారులు కూడా పూర్తి అనుమతులు, లేఅవుట్ ఆమోద పత్రాలు, భూ హక్కుల రికార్డులు పరిశీలించిన తర్వాతే ప్లాట్లు కొనుగోలు చేయాలని అధికారులు సూచిస్తున్నారు. ప్రస్తుతం భ్రమరా వెంచర్ వ్యవహారం కలెక్టర్ కోర్టు పరిధిలో ఉండటంతో విచారణ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు ఉండనున్నాయి. ఈ వ్యవహారం రాజకీయం గానూ ప్రాధాన్యం సంతరించుకోవడంతో ప్రభుత్వ నిర్ణయం ఎలా ఉండబోతుందనే అంశంపై ప్రకాశం, గుంటూరు జిల్లాలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తికర చర్చ సాగుతోంది.

# రైతుల నీటి మోటార్ల దొంగల ముఠా అరెస్ట్

-ఏడుగురు నిందితుల అదుపులోకి
-91 మోటార్ల చోరీ వెలుగులోకి
-రూ.15.47 లక్షల సొత్తు స్వాధీనం
-నీటి మోటార్ల దొంగల ముఠా అరెస్ట్

గుంటూరు జులై 28 వార్త సాక్ష్యం

పొలాల్లో రైతులు వినియోగించే నీటి మోటార్లను రాత్రివేళల్లో దొంగలిస్తున్న ముఠాను పొన్నూరు రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. ఏడుగురు నిందితులను అదుపులోకి తీసుకుని వారి నుంచి భారీగా చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు.పొన్నూరు రూరల్ మండలంలో వరుసగా నీటి మోటార్లు చోరీ అవుతున్నాయంటూ రైతుల నుంచి ఫిర్యాదులు అందడంతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో రాత్రి వేళల్లో అనుమానాస్పదంగా సంచరిస్తున్న క్రెటా కారును గుర్తించి విచారణ చేపట్టగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది.తాడికొండ మండలం ఉప్పారపాలెం గ్రామానికి చెందిన తాడిశెట్టి నాగేశ్వరరావు తన సహచరులతో కలిసి ఈ దొంగతనాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. నాగేశ్వరరావుతో పాటు తాడిశెట్టి వంశీ, ఊటుకూరు చరణ్, షేక్ అఖిల్, మిండల సాంబశివరావు, కటారి సాంబశివరావు, పెద్ద పలకలూరు గ్రామానికి చెందిన స్క్రాప్ వ్యాపారి మరియప్పను అరెస్టు చేశారు.విచారణలో నిందితులు తెనాలి, చుండూరు, పొన్నూరు రూరల్ పరిధుల్లో 91 నీటి మోటార్లను దొంగలించినట్లు అంగీకరించారని ఎస్పీ వెల్లడించారు. చోరీ చేసిన మోటార్ల విలువ బహిరంగ మార్కెట్లో రూ.15.47 లక్షలు ఉంటుందని తెలిపారు.నిందితుల నుంచి చోరీ సొత్తుతో పాటు రెండు కార్లు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ తెలిపారు. గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన సీసీటీవీ 360 కెమెరాల ద్వారా నిందితుల కదలికలను గుర్తించి కేసును ఛేదించినట్లు పేర్కొన్నారు.



# రైతులకు శాస్త్రవేత్తల సూచనలు

రెంటచింతల జులై 28 వార్త సాక్ష్యం

ఎల్‌నినో ప్రభావంతో పెరుగుతున్న అధిక ఉష్ణోగ్రతల కారణంగా నేలలో తేమ తగ్గి పంటలు తీవ్ర వత్తిడికి గురై దిగుబడులు తగ్గే ప్రమాదం ఉందని ఉద్యాన పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ సి. వెంకటరమణ తెలిపారు.మంగళవారం రెంటచింతల మండలంలోని మిట్టగుడిపాడు, గోలి గ్రామాల్లో సాగవుతున్న బొప్పాయి, డ్రాగన్ ఫ్రూట్ తోటలు, షేడ్‌నెట్ నర్సరీల్లోని మిర్చి నారును పరిశీలించిన ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. మిర్చి నారులో తగిన తేమ ఉండేలా చూసుకోవాలని, నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే మల్చింగ్, సమయానుకూల నీటిపారుదల, సమతుల్య ఎరువుల వినియోగంతో పాటు తెల్లదోమ వంటి పురుగులను ఎప్పటికప్పుడు గమనిస్తూ సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని, రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించాలని సూచించారు.ఉద్యాన శాఖ అధికారి యనిబెరా మోహన్ మాట్లాడుతూ మిరప సాగు చేసే రైతులు తప్పనిసరిగా పంట బీమా చేయించుకోవాలని, డ్రిప్ నీటిపారుదల, ఫార్మ్ పాండ్ల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అందిస్తున్న వీడ్‌మ్యాట్, మల్చింగ్, ఫార్మ్ పాండ్లు, నేల సంరక్షణ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సహాయ ఉద్యాన శాఖాధికారులు వెంకటేశ్వర్లు, అశోక్, శంకర నాయక్, వీరాంజనేయులు, రైతులు పాల్గొన్నారు.



# పంట బీమాతో రైతులకు భరోసా



ముండ్లమూరుజులై 28 వార్త సాక్ష్యం

ముండ్లమూరు మండలంలోని రైతులు తాము సాగు చేసిన ప్రతి పంటను ఈ-క్రాప్ బుకింగ్‌లో నమోదు చేసుకోవడంతో పాటు పంటల బీమా చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఏ. తిరుమలరావు సూచించారు. ముండ్లమూరు మండలంలోని పెదరావిపాడు, ఉమామహేశ్వరపురం గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో ఆయన పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. పంట నష్టం సంభవించినప్పుడు రైతులకు అండగా ఉండేందుకు ప్రభుత్వం పంటల బీమా పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు.ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం వరికి ఎకరాకు రూ.860, కందికి రూ.430, సజ్జకు రూ.156, మిర్చికి రూ.4,500, మినుముకు రూ.205, నువ్వులకు రూ.180, పత్తికి రూ.2,100 చొప్పున ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. రైతులు పొలం పాస్‌బుక్ జిరాక్స్, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా వివరాలు, పంట సాగు ధ్రువీకరణ పత్రంతో సమీపంలోని మీ సేవ లేదా సీఎస్సీ కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని సూచించారు.అర్హులైన కౌలు రైతులు సంబంధిత వీఆర్వోలను సంప్రదించి కౌలు కార్డులు పొందాలని, వాటి ద్వారా బ్యాంకుల నుంచి పంట రుణాలు పొందవచ్చని తెలిపారు.మండల ఉద్యాన అధికారి తేజ మాట్లాడుతూ ఉద్యాన పంటల పథకాలు, డ్రిప్ ఇరిగేషన్, పంట నీటి కుంటల ఏర్పాటుపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం పీఎండీఎస్ విత్తనాలు వేసిన పొలాలను అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు శ్రీదేవి, వీరాంజనేయులు, ఉద్యాన శాఖ సహాయకురాలు అఫ్రిన్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అశోక్, వెంకట్రావు, రాజశేఖర్‌రెడ్డి, మరియమ్మ, రైతులు పాల్గొన్నారు.

# హెల్మెట్‌తో ప్రయాణం సురక్షితం



బాపట్ల జులై 28 వార్త సాక్ష్యం

చలానాల కంటే ప్రాణాలు ఎంతో విలువైనవని, ప్రతి ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని బాపట్ల పట్టణ ఎస్సై విజయ్ కుమార్ సూచించారు.జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఆదేశాలు, పట్టణ సీఐ రాంబాబు సూచనల మేరకు మంగళవారం బాపట్ల పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలి వద్ద ఎస్సై విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ద్విచక్ర వాహనాల తనిఖీలు నిర్వహించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న వాహనదారులకు పోలీసులు అవగాహన కల్పించి కౌన్సెలింగ్ ఇచ్చారు.ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ హెల్మెట్ భారం కాదని, అది ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. చిన్న నిర్లక్ష్యం కూడా ప్రాణాలపై ప్రభావం చూపుతుందని, వాహనదారులు హెల్మెట్ ధరించి తమ ప్రాణాలతో పాటు కుటుంబ భద్రతను కాపాడుకోవాలని కోరారు.తనిఖీల్లో భాగంగా డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్లను పరిశీలించారు. అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం, మైనర్లకు వాహనాలు ఇవ్వడం, ఒకే బైక్‌పై ముగ్గురు ప్రయాణించడం వంటి నిబంధనల ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రజల భద్రత కోసం వాహన తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలని ఎస్సై విజయ్ కుమార్ కోరారు.

# పేదల ఆరోగ్యానికి అండగా ఏలూరు సాయం



యద్దనపూడి జులై 28 వార్త సాక్ష్యం

పేదల ఆరోగ్యానికి అండగా నిలుస్తూ ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అవసరమైన వారికి ఆర్థిక సహాయం అందిస్తున్నామని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తెలిపారు.యద్దనపూడి మండలం గన్నవరం గ్రామానికి చెందిన పఠాన్ మహబూబ్ షఫీ కుడి మోకాలు విరిగి తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తన సిఫారసుతో అత్యవసర చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.76,500ల ఎల్‌ఓసీ మంజూరు చేయించారు.మంజూరైన చెక్కును నాయకులు బాధిత కుటుంబానికి అందజేశారు. పేద, మధ్యతరగతి ప్రజలకు వైద్య ఖర్చుల భారం తగ్గించేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతగానో ఉపయోగపడుతోందని వారు తెలిపారు.

VARTHAA SAKSHAMU RNI Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



# బిజినెస్

## చిన్నారుల కోసం టీవీఎస్ రేస్ బైక్ 'అపాచీ ఆర్ఆర్ 200 మినీ' ఆవిష్కరణ



రేసింగ్‌పై ఆసక్తి ఉన్న చిన్నారులను దృష్టిలో పెట్టుకుని టీవీఎస్ రేసింగ్ కొత్తగా 'అపాచీ ఆర్ఆర్ 200 మినీ'ని ఆవిష్కరించింది. 10 నుంచి 14 ఏళ్ల మధ్య వయసున్న చిన్నారులకు నియంత్రిత వాతావరణంలో మోటార్‌సైకిల్ రేసింగ్‌లో శిక్షణ ఇవ్వాలనే లక్ష్యంతో ఈ బైక్‌ను రూపొందించింది. టీవీఎస్ అపాచీ జూనియర్ ప్రోగ్రామ్‌లో భాగంగా ఈ బైక్‌లను వినియోగించనున్నారు. ఇప్పటికే 10 బైక్‌లను 'మద్రాస్ మోటార్ స్పోర్ట్స్ క్లబ్ (ఎంఎంఎస్‌సీ)'కు సంస్థ అందజేసింది. 'మద్రాస్ ఇంటర్నేషనల్ సర్క్యూట్' ఆవరణలో శిక్షణ ఇవ్వనున్నారు. ఈ బైక్‌లో ఆర్‌టీఆర్ 200 4వీలో ఉండే 197.75 సీసీ ఇంజిన్‌ను ప్రత్యేకంగా ట్యూన్ చేసి అమర్చారు. ఇది 9,500 ఆర్‌పీఎం వద్ద 23 పీఎస్ శక్తి, 6,500 ఆర్‌పీఎం వద్ద 20.1 ఎన్ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. ప్రోగ్రామబుల్ టీసీఐ ఇగ్నిషన్ సిస్టమ్, రేసింగ్‌కు అనుకూలంగా రూపొందించిన ఫ్రీ ఫ్లో ఎగ్జాస్ట్‌ను అమర్చారు. కేవలం 90 కిలోల బరువు మాత్రమే ఉండే ఈ బైక్ గరిష్ఠంగా గంటకు 110 కిలోమీటర్ల వేగంతో దూసుకెళుతుందని టీవీఎస్ తెలిపింది. రేసింగ్ అవసరాలకు అనుగుణంగా ఇందులో అత్యాధునిక సస్పెన్షన్, బ్రేకింగ్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ముందు భాగంలో 35 ఎంఎం అప్‌సైడ్ డౌన్ ఫోర్క్స్, వెనుక రేస్ షాక్ అబ్జార్బర్ ఇచ్చారు. రీబౌండ్, కంప్రెషన్, ప్రీలోడ్ సర్దుబాటు చేసుకునే సదుపాయం ఇందులో ఉంది. ముందుభాగంలో 220 ఎంఎం డిస్క్, వెనుక 180 ఎంఎం డిస్క్ బ్రేకులు అమర్చారు. 12 అంగుళాల వీల్స్‌తో పాటు రేస్ కాంపౌండ్ యూరోగ్రిప్ బీటలాట టైర్లను వినియోగించారు. ఈ బైక్‌ను యువ రేసర్ల కోసం ప్రత్యేకంగా రూపొందించారు.

## భారత్‌లో టెస్లా జోరు- తొలి సర్వీస్ సెంటర్‌తో పాటు టెస్ట్ డ్రైవ్‌లు ప్రారంభం

భారత్‌లో తన కార్యకలాపాలను టెస్లా మరింత విస్తరిస్తోంది. అమ్మకాల తర్వాత అందించే సేవలను బలోపేతం చేసే దిశగా మహారాష్ట్రలోని పుణెలో తొలి ఆథరైజ్డ్ బాడీ షాప్‌ను ప్రారంభించింది. ఇదే సమయంలో 2026 మోడల్ 'వై' ప్రీమియం రియర్ వీల్ డ్రైవ్, మోడల్ వై ఎల్ వాహనాలకు టెస్ట్ డ్రైవ్‌లను కూడా అందుబాటులోకి తీసుకొచ్చింది. పుణెలో ప్రారంభించిన ఆథరైజ్డ్ బాడీ షాప్ ద్వారా మహారాష్ట్రలోని టెస్లా వినియోగదారులకు సర్వీస్ సపోర్ట్ అందించనుంది. ఒరిజినల్ విడిభాగాలు, ప్రత్యేక శిక్షణ పొందిన సాంకేతిక నిపుణులు, టెస్లా ప్రమాణాలకు అనుగుణంగా ప్రమాదాల్లో దెబ్బతిన్న వాహనాల మరమ్మతులు, నిర్వహణ సేవలు ఈ కేంద్రంలో అందుబాటులో ఉంటాయని కంపెనీ తెలిపింది. ఈ కేంద్రంలో బాడీ రిపేర్లు, సాఫ్ట్‌వేర్ ఆధారిత డయాగ్నస్టిక్స్, ఒరిజినల్ టెస్లా స్పేర్ పార్ట్స్‌తో మరమ్మతులు చేపడతామని పేర్కొంది. దీంతో వాహన భద్రత, పనితీరు మెరుగ్గా ఉండటంతో పాటు వినియోగదారులకు తక్కువ సమయంలోనే సేవలు అందుతాయని వివరించింది. పుణెతో పాటు సమీప ప్రాంతాల వినియోగదారుల కోసం 2026 మోడల్ 'వై' ప్రీమియం రియర్ వీల్ డ్రైవ్, 'మోడల్ వై ఎల్' వాహనాల టెస్ట్ డ్రైవ్‌లను కూడా ప్రారంభించింది. ఆసక్తి ఉన్నవారు టెస్లా అధికారిక వెబ్‌సైట్ లేదా కస్టమర్ సపోర్ట్ ద్వారా ముందస్తుగా బుక్ చేసుకోవచ్చని తెలిపింది.




మోడల్ వై ప్రీమియం రియర్ వీల్ డ్రైవ్ ప్రారంభ ధర రూ.50.89 లక్షలు. ఒక్కసారి పూర్తి ఛార్జింగ్‌తో గరిష్ఠంగా 500 కిలోమీటర్ల వరకు ప్రయాణించగలదని కంపెనీ పేర్కొంది. 0 నుంచి 100 కిలోమీటర్ల వేగాన్ని 5.9 సెకన్లలో అందుకుంటుంది. 2,138 లీటర్ల వరకు లగేజ్ సామర్థ్యం ఉంది. ఈ మోడల్ డెలివరీలు జులై నుంచే ప్రారంభం కానున్నాయి. మరోవైపు కుటుంబ అవసరాలను దృష్టిలో ఉంచుకొని మూడు వరుసల సీట్లు, ఆరు సీట్ల సామర్థ్యంతో మోడల్ వై ఎల్‌ను తీసుకొచ్చింది. దీని ప్రారంభ ధర రూ.61.99 లక్షలు. ఒక్కసారి ఛార్జింగ్‌తో 681 కిలోమీటర్ల వరకు ప్రయాణించే సామర్థ్యం ఉంది. 0 నుంచి 100 కిలోమీటర్ల వేగాన్ని ఐదు సెకన్లలో చేరుకుంటుంది. 2,539 లీటర్ల వరకు లగేజ్ స్పేస్ అందుబాటులో ఉంటుంది. భారత్‌లో వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడంలో భాగంగానే ఈ విస్తరణ చేపట్టినట్లు టెస్లా తెలిపింది.

## టాల్కమ్ పౌడర్ కేసుల్లో మెట్టుదిగిన జాన్సన్ & జాన్సన్- సెటిల్మెంట్ కోసం వేల కోట్ల ఆఫర్

తమ టాల్క్ ఆధారిత ఉత్పత్తుల వల్ల 'అండాశయ క్యాన్సర్' బారిన పడ్డామంటూ దాఖలైన వేలాది కేసుల పరిష్కారానికి ప్రముఖ సంస్థ జాన్సన్ & జాన్సన్ ఒక కీలక ముందడుగు వేసింది. దశాబ్దాలుగా కొనసాగుతున్న ఈ న్యాయపోరాటానికి ముగింపు పలికేందుకు, మిగిలిన కేసులను పరిష్కరించు కోవడానికి 5.5 బిలియన్ డాలర్ల (దాదాపు రూ. 52,676 కోట్లు) వరకు చెల్లించేందుకు ఒక ఒప్పందాన్ని ప్రకటించింది. అయితే, ఈ సెటిల్మెంట్‌కు దాదాపు 95 శాతం మంది బాధితులు అంగీకరించాలనే కీలక షరతు విధించింది. ఈ ప్రతిపాదిత ఒప్పందం ప్రకారం, 2027లో తొలి విడతగా 3 బిలియన్ డాలర్ల వరకు చెల్లింపులు జరపనుంది. 2028కి ముందు ఎలాంటి అదనపు చెల్లింపులు ఉండవని కంపెనీ తన ప్రకటనలో స్పష్టం చేసింది. అమెరికాలోని ఫెడరల్, రాష్ట్ర కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న టాల్క్ సంబంధిత అన్ని కేసులకు ఈ ఒప్పందం వర్తిస్తుంది. ఇదివరకే 'మీసోథెలియోమా' (meso the lioma) వ్యాధికి సంబంధించిన 95 శాతం కేసులను, ఇతర వినియోగదారుల రక్షణ క్లెయిమ్‌లను కంపెనీ పరిష్కరించుకుంది. ఈ పరిణామంపై జాన్సన్ & జాన్సన్ వరల్డ్‌వైడ్ వైస్ ప్రెసిడెంట్ ఆఫ్ లిటిగేషన్, ఎరిక్ హాస్ మాట్లాడుతూ.. "ఈ కేసుల్లోని ఆరోపణలకు ఎలాంటి శాస్త్రీయ ఆధారాలు లేవని మేం ఇప్పటికీ గట్టిగా విశ్వసిస్తున్నాం. అయినప్పటికీ, ఈ సుదీర్ఘ న్యాయపోరాటానికి ముగింపు పలకాలనే ఉద్దేశంతోనే సెటిల్మెంట్‌కు అంగీకరిస్తున్నాం" అని తెలిపారు. దశాబ్దాల పరిశోధనలు, స్వతంత్ర నిపుణుల అధ్యయనాలు తమ టాల్క్ ఉత్పత్తుల భద్రతను నిర్ధారించాయని, వాటిలో ఆస్‌బెస్టాస్ లేదని, వాటి వల్ల క్యాన్సర్ రాదని కంపెనీ పునరుద్ఘాటించింది. కాగా, కంపెనీ ఇప్పటికే




2023లో ప్రపంచవ్యాప్తంగా టాల్క్ ఆధారిత జాన్సన్స్ బేబీ పౌడర్ అమ్మకాలను నిలిపివేసింది. అదే ఏడాది, తన కన్స్యూమర్ హెల్త్ వ్యాపారాన్ని 'కెన్‌వ్యూ' (ఖవఅజఖవ) పేరుతో వేరు చేసినప్పటికీ, టాల్క్‌కు సంబంధించిన అన్ని చట్టపరమైన బాధ్యతలను జాన్సన్ & జాన్సన్ తనపైనే ఉంచుకుంది. నిర్దేశిత షరతులు నెరవేరితేనే ఈ సెటిల్మెంట్ ఒప్పందం అమల్లోకి వస్తుంది.

## యూఎస్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్: సబలెంకాతో జతకట్టనున్న జకోవిచ్

ఇంటర్నెట్ డెస్క్:
యూఎస్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్ ఛాంపియన్‌షిప్‌లో టెన్నిస్ దిగ్గజం నొవాక్ జకోవిచ్, ప్రపంచ నంబర్ 1 మహిళా ప్లేయర్ అరీనా సబలెంకా జోడీగా బరిలోకి దిగనున్నారు. వీరితో పాటు పాల్గొనే 16 జోడీల జాబితాను టోర్నీ నిర్వాహకులు ప్రకటించారు. 24 గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు గెలిచిన జకోవిచ్ అనుభవానికి, సబలెంకా దూకుడు ఆట జత కావడంతో ఈ జోడీ టైటిల్ ఫేవరెట్‌గా భావిస్తున్నారు. గతేడాది ప్రవేశపెట్టిన కొత్త మిక్స్‌డ్ డబుల్స్ ఫార్మాట్‌ను యూఎస్ టెన్నిస్ అసోసియేషన్ (ఖూతాా) ఈసారి కూడా కొనసాగిస్తోంది. ఆగస్టు 25, 26 తేదీల్లో సింగిల్స్ ప్రధాన డ్రాకు ముందే ఈ పోటీలు నిర్వహించనున్నారు. విజేత జోడీకి 10 లక్షల అమెరికన్ డాలర్ల ప్రైజ్ మనీగా అందజేయనున్నారు. జకోవిచ్, సబలెంకాతో పాటు 2025లో రన్నరప్‌గా నిలిచిన ఇగా స్వియాటెక్, కాస్పర్ రూడ్, ఎలెనా రైబాకినా-టేలర్ ఫ్రిట్జ్, నవోమి ఒసాకా-కీ నిషికోరి, జెస్సికా పెగులా-జాక్ డ్రేపర్ మరోసారి బరిలోకి దిగనున్నారు. ఆర్థర్ ఆషే స్టేడియం, లూయిస్ ఆర్మ్‌స్ట్రాంగ్ స్టేడియాల్లో అన్ని మ్యాచ్‌లను నిర్వహించనున్నారు. కాగా జకోవిచ్, సబలెంకా కోర్టు వెలుపల కూడా మంచి స్నేహితులు. కొన్నేళ్లుగా ఇద్దరూ కలిసి సాధన చేయడం, ఒకరికి ఒకరు సలహాలు ఇచ్చుకోవడం అభిమానులను ఆకట్టుకుంది. జకోవిచ్ అనుభవం, సబలెంకా పవర్ హిట్టింగ్ కలిస్తే ప్రత్యర్థులకు గట్టి సవాలు తప్పదని టెన్నిస్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. మిక్స్‌డ్ డబుల్స్‌లో మొత్తం ఆరు జట్లు సింగిల్స్ ర్యాంకింగ్స్ ఆధారంగా నేరుగా అర్హత సాధించనున్నాయి. మిగిలిన స్థానాలను వైల్డ్ కార్డులు, క్వాలిఫ యర్ల ద్వారా భర్తీ చేయనున్నారు. డిఫెండింగ్ ఛాంపియన్స్ సారా ఎర్రాని, ఆండ్రీ వవస్సోరిలు కూడా తమ టైటిల్‌ను నిలబెట్టుకునేందుకు పోటీలోకి రానున్నారు.




## కొడుకు కల కోసం క్యాన్సర్‌ను దాచిన తండ్రి-11 ఏళ్ల నిరీక్షణకు ఫలితం!

స్పోర్ట్స్ డెస్క్:
చాలా మంది కష్టపడుతూ అవకాశం కోసం కొంత సమయం మాత్రమే ఎదురు చూస్తుంటారు. కానీ ఇంకొందరు మాత్రం అవకాశం వచ్చే వరకు పోరాడుతూనే ఉంటారు. చివరకు అనుకున్నది సాధించి.. చరిత్రలో నిలుస్తారు. అలాంటి వారి జాబితాలో నిలుస్తాడు టీమిండియా క్రికెటర్ సరాంశ్ జైన్. దేశవాళీ క్రికెట్‌లో ఏళ్ల తరబడి నిలకడగా రాణిస్తున్న సరాంశ్‌కు తన కెరీర్‌లోనే అద్భుతమైన అవకాశం లభించింది. మధ్యప్రదేశ్‌కు చెందిన ఈ 33 ఏళ్ల ఆఫ్ స్పిన్నర్ రెడ్‌బాల్ క్రికెట్‌లో అదరగొట్టి 11 ఏళ్ల నిరీక్షణ తర్వాత భారత జట్టులో చోటు దక్కించుకున్నాడు.వచ్చే నెలలో శ్రీలంకతో జరగనున్న రెండు మ్యాచ్‌ల సిరీస్‌కు సరాంశ్ జైన్‌ను బీసీసీఐ ఎంపిక చేసింది. గాయపడిన వాషింగ్టన్ సుందర్ స్థానంలో అతడికి చోటు దక్కింది. ఇటీవల శ్రీలంక పర్యటనకు వెళ్లిన భారత-ఏ జట్టులో సరాంశ్ ఉన్నాడు. లంకతో జరిగిన రెండో టెస్టులో సరాంశ్ ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబర్చాడు. రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి ఆరు వికెట్లు పడగొట్టిన జైన్.. బ్యాటింగ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో 70 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. మధ్యప్రదేశ్ సీనియర్ జట్టులో స్థానం సంపాదించినప్పటి నుంచి లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్ అయిన సరాంశ్ అన్ని విభాగాల్లో రాణించి మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు. క్రమశిక్షణతో కూడిన బౌలింగ్‌తో బ్యాటర్లను కట్టడి చేస్తూ.. కీలక సమయాల్లో వికెట్లు తీస్తుంటాడు. అలానే బ్యాటింగ్ లోయా జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు ఆదుకుంటాడు. భారత్ ఎ, సెంట్రల్ జోన్ (దులీప్ ట్రోఫీ), రెస్ట్ ఆఫ్ ఇండియా (ఇరానీ ట్రోఫీ) తరఫున రాణించాడు. దీంతో బీసీసీఐ సెలక్టర్ల దృష్టిలో పడి తాజాగా జాతీయ జట్టుకు ఎంపికయ్యాడు.

**-క్యాన్సర్ విషయాన్ని దాచిన జైన్ తండ్రి:**
తన క్రికెట్ కెరీర్ కోసం కుటుంబం ఏ విధంగా అండగా నిలిచిందో తెలిపే ఒక సంఘటనను జైన్ ఓ ఇంటర్వ్యూలో వెల్లడించాడు. 2014లో మధ్యప్రదేశ్ క్లబ్ తరఫున ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్నప్పుడు జైన్ తండ్రికి క్యాన్సర్ ఉన్నట్లు నిర్ధారణ అయిందట. సరాంశ్ ఆటపైనే పూర్తిగా దృష్టి సారించడానికి అతడి తండ్రికి జరిగిన క్యాన్సర్ శస్త్రచికిత్స గురించి అప్పుడు కుటుంబసభ్యులు తెలియజేయలేదట. ఇండియాకు వచ్చిన తర్వాతే తన తండ్రి ఆరోగ్యం గురించి తెలిసిందని ఆ ఇంటర్వ్యూలో జైన్ వెల్లడించాడు.




# స్పోర్ట్స్

## శ్రీలంకతో టెస్టు సిరీస్- జట్టును ప్రకటించిన బీసీసీఐ




స్పోర్ట్స్ డెస్క్:
ఇటీవల జింబాబ్వేతో మూడు టీ20 మ్యాచ్‌ల సిరీస్‌ను 3-0తేడాతో భారత్ జట్టు కైవసం చేసుకుంది. వచ్చే నెలలో శ్రీలంకతో రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ ఆడనుంది. ఈ నేపథ్యంలో బీసీసీఐ ఇవాళ(మంగళవారం) భారత జట్టును ప్రకటించింది. అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలెక్షన్ కమిటీ 15 మంది సభ్యులతో కూడిన జట్టు వివరాలను వెల్లడించింది. ఈ టెస్టు సిరీస్‌కు శుభ్‌మన్ గిల్ నాయకత్వం వహించనున్నాడు. అలానే కేఎల్ రాహుల్ వైస్ కెప్టెన్‌గా ఉండనున్నాడు. బీసీసీఐ ప్రకటించిన జట్టులో టీమిండియా సీనియర్ ప్లేయర్ రవీంద్ర జడేజాకు చోటుదక్కింది. దాదాపు ఏడాది తర్వాత జడేజా టెస్టుల్లో రీఎంట్రీ ఇవ్వనున్నాడు. సారాన్ష్ జైన్‌కు తొలిసారి భారత జట్టులో చోటు దక్కింది. మధ్యప్రదేశ్ తరఫున 131 ఫస్ట్-క్లాస్ వికెట్లు సాధించిన జైన్, ఇటీవల శ్రీలంక 'ఎ' జట్టుపై ఇండియా 'ఎ' తరఫున అద్భుత ప్రదర్శనలతో జట్టులో తన స్థానాన్ని పదిలపరుచుకున్నాడు. అలానే జస్ప్రీత్ బుమ్రా, సాయి సుదర్శన్ లను ఎంపిక చేసినప్పటికీ సిరీస్ ప్రారంభ మయ్యే సమయానికి ఫిట్‌నెస్ నిరూపించుకోవాల్సి ఉంటుందని బీసీసీఐ స్పష్టం చేసింది. రెండు టెస్టు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా తొలి టెస్టు ఆగస్టు 15 నుంచి 19 మధ్య గాలే వేదికగా జరగనుంది. ఆగస్టు 23 నుంచి 27 వరకు జరిగే రెండో టెస్టుకు కొలంబో వేదిక కానుంది. ఈ సిరీస్‌కు ముందు భారత జట్టు ఆగస్టు 7వ తేదీ నుంచి కొలంబోలో నాలుగు రోజుల ప్రాక్టీస్ మ్యాచ్ ఆడనుంది.

**-శ్రీలంకతో టెస్టులకు భారత జట్టు:**
శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), కేఎల్ రాహుల్ (వైస్ కెప్టెన్), యశస్వి జైస్వాల్, రిషబ్ పంత్ (వికెట్ కీపర్), సాయి సుదర్శన్, ధ్రువ్ జురెల్ (వికెట్ కీపర్), రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, మానవ్ సుతార్, జస్ప్రీత్ బుమ్రా, సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, గుర్నూర్ బ్రార్, దేవదత్ పడిక్కల్, సరన్ష్ జైన్

VARTHAA SAKSHAMU RNI.Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
బుధవారం 29 జూలై 2026

## రిజర్వేషన్లపై ఫేక్ పోస్ట్.. తీవ్రంగా స్పందించిన శిల్పాశెట్టి

బాలీవుడ్ నటి శిల్పాశెట్టి తన పేరుతో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఒక నకిలీ పోస్టుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలోని రిజర్వేషన్ల వ్యవస్థపై తాను స్పందించినట్లుగా జరుగుతున్న ప్రచారాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు. అదంతా పూర్తిగా కల్పితమని, దురుద్దేశంతో చేస్తున్న తప్పుడు ప్రచారమని ఆమె కొట్టిపారేశారు. ఇటువంటి తప్పుడు వార్తలను ఎవరూ నమ్మవద్దని ఆమె ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శిల్పాశెట్టి ఇన్‌స్టాగ్రామ్ ఖాతా నుంచి పోస్ట్ చేసినట్లుగా ఉన్న ఒక స్క్రీన్‌షాట్ ఇటీవల సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. "జనరల్ కేటగిరీ వైద్యులు కేవలం జనరల్ కేటగిరీ రోగులకు మాత్రమే చికిత్స చేయాలి. ఇతర కులాల వైద్యులు వారి వారి కులాల వారికి మాత్రమే చికిత్స అందిస్తే, రిజర్వేషన్లు వద్దనే డిమాండ్ వస్తుంది. రిజర్వేషన్ ద్వారా నైపుణ్యం రాదు" అని ఆ పోస్టులో పేర్కొన్నారు. ఈ ప్రచారంపై శిల్పాశెట్టి 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ వివరణ ఇచ్చారు. "రిజర్వేషన్లపై నా పేరుతో ఇటువంటి తప్పుడు ప్రకటనలు వైరల్ కావడం చూసి దిగ్భ్రాంతికి గురయ్యాను. ఇది పూర్తిగా కల్పితం మరియు దురుద్దేశపూర్వక ప్రచారం. దయచేసి ఇటువంటి నకిలీ వార్తలను నమ్మకండి" అని ఆమె పోస్ట్ చేశారు. అయితే, సదరు పోస్టును ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతతో సృష్టించి ఉండవచ్చని భావిస్తున్నారు.



## ఇకపై నా ప్రయాణం సాధారణంగా ఉండదు
## పొలిటికల్ ఎంట్రీపై క్లూ ఇచ్చిన హీరో విశాల్

కోలీవుడ్‌లో స్టార్ హీరోలంతా వరుసగా రాజకీయ బాట పడుతున్నట్లు కనిపిస్తోంది. ఇప్పటికే 'తమిళగ వెట్రి కళగం' పార్టీతో తుపాను సృష్టించిన విజయ్ తమిళనాడు ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించారు. మరోవైపు, ఇటీవల మరో హీరో ధనుష్ చేసిన కామెంట్స్ ఆయన కూడా పొలిటికల్ ఎంట్రీ ఇవ్వబోతున్నారనే చర్చకు తెరలేపాయి. తాజాగా ఈ జాబితాలో మాస్ హీరో విశాల్ కూడా చేరారు. ఓ బహిరంగ సభలో ఆయన చేసిన వ్యాఖ్యలు తమిళనాడులో తీవ్ర ఆసక్తి రేకెత్తిస్తున్నాయి.సినిమా రంగంలో ఇన్నాళ్లూ సంపాదించుకున్న ప్రజాదరణను, మంచి పేరును ఇకపై ప్రజాసేవ కోసం ఉపయోగించాలని భావిస్తున్నట్లు విశాల్ ప్రకటించారు. "ఇన్ని సంవత్స రాలుగా ఇండస్ట్రీలో నటుడిగా మీ నుంచి ఎంతో ప్రేమను, అభిమానాన్ని పొందాను. ఆ అభిమానానికి, ప్రేమకు ప్రతిఫలంగా మీకు తిరిగి ఏదో ఒకటి చేయాలని బలంగా నిశ్చయించుకున్నాను. ఇకపై నా ప్రయాణం గతంలో మాదిరి సాధారణంగా ఉండదు. నేరుగా, అత్యంత నిజాయతీగా ప్రజలకు సేవ చేయాలనుకుంటున్నాను. అన్ని రకాలుగా మీకు అండగా ఉంటాను" అని వ్యాఖ్యానించారు.ఇప్పటికే నడిగర్ సంగమ్, ప్రొడ్యూసర్ కౌన్సిల్ బాధ్యతల్లో తనదైన ముద్ర వేసిన విశాల్, గతంలోనూ ఆర్‌కే నగర్ ఉపఎన్నికలో పోటీకి యత్నించిన సంగతి తెలిసిందే. రాజకీయ నాయకులు సరిగా పనిచేయనందునే కొత్త రక్తం రాజకీయాల్లోకి రావాల్సి వస్తోందని, త్వరలోనే తన రాజకీయ పయనానికి సంబంధించి పూర్తి వివరాలు వెల్లడిస్తానని సూచించారు. ఇకపై తన అభిమాన సంఘాన్ని ప్రజా సేవ కోసం కూడా నడిపిస్తానని తెలిపారు. తన ఆలోచన వెనుక రాజకీయ ప్రయోజనాలు లేవని... సమయం అనుకూలిస్తే ప్రజల కోసం ప్రజాక్షేత్రంలో నిలబడతానని స్పష్టం చేశారు. విశాల్ వ్యాఖ్యలను బట్టి ఆయన త్వరలోనే సొంత పార్టీ ప్రకటన లేదా క్రియాశీల రాజకీయాల్లోకి దిగడం ఖాయమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



## 'ఆదర్శ కుటుంబం'లో నివేదా పేతురాజ్ స్పెషల్ గ్లింప్స్‌తో సర్‌ప్రైజ్ ఇచ్చిన మేకర్స్

విక్టరీ వెంకటేష్, దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'ఆదర్శ కుటుంబం' సినిమాపై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. తాజాగా ఈ చిత్రంలో హీరోయిన్ నివేదా పేతురాజ్ కూడా కీలక పాత్రలో నటిస్తున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ విషయాన్ని వెల్లడిస్తూ విడుదల చేసిన ప్రత్యేక గ్లింప్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరలవుతోంది. మొదట నివేదా పేతురాజ్ ఈ సినిమాలో స్పెషల్ సాంగ్‌లో కనిపిస్తారనే ప్రచారం జరిగింది. అయితే ఆ వార్తలకు చెక్ పెడుతూ మేకర్స్ విడుదల చేసిన గ్లింప్స్‌లో ఆమె కీలక పాత్ర పోషిస్తున్నట్లు స్పష్టం చేశారు. వీడియోలో వెంకటేశ్ సరదా డైలాగ్‌లతో ఆకట్టుకోగా, నివేదా చిరునవ్వుతో ఎంట్రీ ఇచ్చి ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించారు. గ్లింప్స్‌లో వెంకటేశ్ ఇంటి నుంచి కోపంగా బయటకు వచ్చి, నేటి మహిళలపై సరదాగా వ్యాఖ్యలు చేస్తారు. అదే సమయంలో ఎదురుగా నివేదా పేతురాజ్ నవ్వుతూ కనిపించడంతో, "ఆడది అంటే ఇలా నవ్వాలి" అంటూ తన భార్య గురించి వెంకటేశ్ చెప్పే కామెడీ డైలాగ్ నవ్వులు పూయిస్తుంది. చివర్లో కమెడియన్ సత్య వచ్చి "ఊరుకో నాయనా.. ఇది మన ఆదర్శ కుటుంబం" అని చెప్పడంతో వీడియో ముగుస్తుంది.ఈ చిత్రంలో శ్రీనిధి స్వర్ణ కీలక పాత్రలో నటిస్తున్నారు. గ్లింప్స్‌ను బట్టి చూస్తే నివేదా పేతురాజ్ పాత్రకు కూడా కథలో ప్రత్యేక ప్రాధాన్యం ఉన్నట్లు తెలుస్తోంది. వెంకటేశ్ కెరీర్‌లో ఇది 77వ చిత్రం కాగా, నారా రోహిత్ మరో ముఖ్యమైన పాత్రలో నటిస్తున్నారు. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి తమన్ సంగీతం అందిస్తున్నారు. అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా సినిమాను ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నారు.



## ఓటీటీలోకి వస్తున్న సత్యదేవ్ 'రావు బహదూర్' స్ట్రీమింగ్ ఎప్పటి నుంచి అంటే..!

టాలీవుడ్ హీరో సత్యదేవ్ ప్రధాన పాత్రలో, ప్రశాంత్ కుమార్ డి దర్శకత్వంలో తెరకెక్కిన పీరియడ్ సోషల్ డ్రామా 'రావు బహదూర్' డిజిటల్ విడుదల తేదీ ఖరారైంది. సినీ అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న ఈ చిత్రం ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్‌లో జులై 31 నుంచి ప్రపంచవ్యాప్తంగా అందుబాటులోకి రానుంది. తెలుగు, తమిళ్, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో స్ట్రీమింగ్ కాబోతోంది. సూపర్ స్టార్ మహేశ్ బాబుకు చెందిన జీఎంబీ ఎంటర్‌టైన్‌మెంట్స్ సమర్పణలో ఈ చిత్రం తెరకెక్కింది.థియేటర్లలో విడుదలైన సమయంలో ఈ సినిమా వైవిధ్యమైన కథాంశం, సత్యదేవ్ బలమైన నటన, సాంకేతిక ప్రమాణాలతో ప్రేక్షకులు, విమర్శకుల నుంచి మంచి స్పందనను సొంతం చేసుకుంది. సత్యదేవ్ ప్రదర్శించిన నటన, దర్శకుడు మలిచిన ఉత్కంఠభరితమైన కథనం ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ఇప్పుడు నెట్‌ఫ్లిక్స్ ద్వారా ఓటీటీలోకి వస్తుండటంతో ఈ సినిమా మరింత ఎక్కువ మంది ప్రేక్షకులకు చేరువ కోబోతోంది




PRINTED ,PUBLISHED ,OWNED BY VARTHAA SAKSHAMU NEWS .Regd no:APTEL/25/A5153, EDITOR :S.RAVI KUMAR, 32-3-1, SPG PALEM, ATMAKURU, KURNOOL ANDHRAPRADESH,-518422.